


విజయభాను

విజయవాడ, బుధవారం 05-07-2017 | VIJAYABHANU DAILY VIJAYAWADA EDITION | సంపుటి : 10 సంచిక : 32 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## అగ్రనేతలిద్దరూ మళ్లీ కలుస్తున్నారు...

### ప్రాధాన్యత సంతరించుకోనున్న జీ-20 సదస్సు



న్యూఢిల్లీ: సరిహద్దుల్లో చైనా రోడ్డు నిర్మాణం విషయంలో బీజింగ్, భారత్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ జీ-20 సదస్సులో ఒకరికొకరు మరోసారి తారసపడనున్నారు. ఈనెల 7న జర్మనీలోని హంబర్గ్‌లో సదస్సు సందర్భంగా అగ్రనేతలిరువురూ సమావేశమయ్యే అవకాశాలున్నాయి. షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సీఓ) సదస్సు సందర్భంగా నెలరోజుల క్రితమే కజకిస్థాన్‌లోని ఆస్తానలో ఉభయ నేతలూ సమావేశమయ్యారు. కాగా,

తరువాయి 2లో

## జీఎస్‌టీపై రాహుల్ గాంధీ విజయం

న్యూఢిల్లీ : కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ నరేంద్ర మోదీ ప్రభుత్వంలో స్పందన తీసుకొచ్చారు. దివ్యాంగులకు ఉపయోగపడే వస్తువులపై భారీగా జీఎస్‌టీని ఎందుకు వడ్డించారని ప్రభుత్వాన్ని నిలదీయడంతో ప్రభుత్వం తక్షణమే స్పందించింది. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఓ ప్రకటనలో దివ్యాంగులకు ఉపయోగపడే వాటిపై జీఎస్‌టీ 5 శాతం అని ప్రకటించింది. గతంలో ఈ పన్ను 5 శాతం నుంచి 8 శాతం వరకు ఉండేది.

క్రింద పేర్కొన్నవాటిపై జీఎస్‌టీ 5 శాతం వసూలు చేస్తారని ఆర్థిక శాఖ ప్రకటించింది.

బ్రెయిలీ రైటర్స్, బ్రెయిలీ రైటింగ్ పరికరాలు.బ్రెయిలీ ఫ్రేమ్స్,

తరువాయి 2లో

## పార్లమెంటులో అల్లూరి విగ్రహం పెట్టిస్తాం

### ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు



విజయవాడ: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని పార్లమెంటులో పెట్టేందుకు తెలుగుదేశం పార్టీ అన్ని రకాలుగా ప్రయత్నాలు చేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఏడాదిలోనే విగ్రహాన్ని పార్లమెంటులో పెట్టే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. అల్లూరి సీతారామరాజు 120వ జయంతి సందర్భంగా విజయవాడ సత్యనారాయణపురంలోని బుడమేరు వంతెన వద్దనున్న ఆయన విగ్రహానికి చంద్రబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. సాహసానికి మారుపేరైన అల్లూరిని తెలుగువారు కలకాలం గుర్తుంచుకుంటారన్నారు. అల్లూరి స్ఫూర్తితోనే రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధికి నిరంతరం పాటుపడుతోందన్నారు.

ఆదివాసీలు మూఢనమ్మకాలను విడనాడాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం తవ్వించిన బోర్ల నీటిని కాకుండా సెలయేటి నీళ్లను తాగడం వల్లనే ఇటీవల ఏజెన్సీలో ఇబ్బందికరమైన పరిస్థితులు తలెత్తాయని అన్నారు.

కార్తి చిదంబరం కేసులో ఈడీకి

## సుప్రీంకోర్టు షాక్



న్యూఢిల్లీ : కేంద్ర మాజీ మంత్రి పి. చిదంబరం కుమారుడు కార్తి చిదంబరం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కి

వార్త 8లో

### ప్రజాస్వామ్యంలో

## ఎవరైనా పోటీ చేయవచ్చు

- కేసీఆర్ మద్దతు కోరిన రామ్‌నాథ్
- కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపిన వెంకయ్యనాయుడు
- వైకాపా అధినేత జగన్‌తో భేటీ



హైదరాబాద్: అన్ని విధాలా అర్హత ఉన్నందునే రామ్‌నాథ్‌ను రాష్ట్రపతి అభ్యర్థిగా ప్రకటించామని కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రపతి ఎన్నికల ప్రచారంలో భాగంగా రామ్‌నాథ్ ఈరోజు హైదరాబాద్‌లో పర్యటిస్తున్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి కేసీఆర్‌తో ఆయన భేటీ అయి మద్దతు కోరారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. వివాద రహితుడు, రచయిత, మంచి వక్త, రాజ్యాంగం పట్ల నిబద్ధత కలిగిన వ్యక్తి కాబట్టే రామ్‌నాథ్‌ను రాష్ట్రపతి అభ్యర్థిగా ప్రకటించామన్నారు. రామ్‌నాథ్ రాజ్యసభ సభ్యుడిగా రెండుస్లారు పనిచేశారని.. బిహార్ గవర్నర్‌గానూ పనిచేశారని తెలిపారు. రామ్‌నాథ్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించిన కేసీఆర్ కేంద్ర ప్రభుత్వం, భాజపా తరపున కృతజ్ఞతలు తెలిపారు. రామ్‌నాథ్‌కు మెజార్టీ

తరువాయి 2లో

## త్వరలో చెలామణిలోకి రూ.200 నోటు!



దిల్లీ: దేశవ్యాప్తంగా రూ.200 నోటును రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) చెలామణిలోకి తీసుకురానుంది. ఇందుకు సంబంధించిన అంశంపై జరిగిన కీలక చర్చల్లో పాల్గొన్న ఓ ఉన్నతాధికారి ఈ విషయాన్ని వెల్లడించారు. ఇప్పటికే వీటిని ప్రింటింగ్‌కు కూడా ఇచ్చినట్టు తెలిపారు. ఈ నోట్లను తీసుకొచ్చే ఆవశ్యకతపై ఆర్థికమంత్రిత్వ శాఖతో మార్చిలోనే సంప్రదింపులు జరిగాయట. దీనిపై త్వరలోనే ఆర్‌బీఐ నోటిఫికేషన్ జారీచేయనుంది. దేశంలో చిల్లర సమస్యలు తలెత్తకుండా పరిస్థితిని చక్కదిద్దేందుకే రూ.200 నోట్లను చెలామణిలోకి తేవాలని భావిస్తున్నట్టు తెలుస్తోంది.

## రామ్‌నాథ్‌కు ఓటేయడం అదృష్టం

### చంద్రబాబు

విజయవాడ: రాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థి రామ్‌నాథ్ కోవింద్‌కు ఓటువేయడం అదృష్టంగా భావిస్తున్నట్టుఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. విజయవాడలోని ఏ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు. కోవింద్‌ను అభ్యర్థిగా ఎంపికచేసినట్టు ప్రధాని మోదీ తనకు ఫోన్‌లో చెప్పారనీ, వెంటనే తన మద్దతు ప్రకటించినట్టు చెప్పారు. 26 ఏళ్ల క్రితం రామ్‌నాథ్ కోవింద్ భాజపాలో చేరారనీ, ఇప్పటివరకు ఎలాంటి వివాదాలు ఆయనపై లేవన్నారు. రాష్ట్రపతి అయ్యేందుకు అన్ని అర్హతలూ కోవింద్‌కు ఉన్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ప్రధాని నరేంద్ర మోదీ అన్నివిధాలా సహకారం అందిస్తున్నారని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అన్నారు. అనంతరం రామ్‌నాథ్ కోవింద్, వెంకయ్య నాయుడు, మురళీధర్‌రావు సహా పలువురిని ఈ సందర్భంగా చంద్రబాబు ఘనంగా సత్కరించారు.

## మద్యం దుకాణాలకు వ్యతిరేకంగా ఉద్యమం

### రోజంతా రహదారిపైనే మహిళల ఆందోళన

విజయవాడ : స్థానిక శ్రీరామలింగేశ్వనగర్‌లో జనావాసాల మధ్య మద్యం దుకాణాల ఏర్పాటును వ్యతిరేకిస్తూ మహిళలు ఉద్యమిస్తున్నారు. దుకాణాల వైపు వెళ్లే రహదారులకు అడ్డంగా టెంట్లు వేశారు. వాటిలో బైఠాయించి రోజంతా ఆందోళన కొనసాగించారు. స్థానికులతో పాటు, సమీప ప్రాంతాల వారు స్వచ్ఛందంగా తరలివచ్చి మద్దతు తెలిపి ఆందోళనలో పాల్గొన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇక్కడ మద్యం దుకాణాలు ఉండటానికి వీల్లేదని, దీని కోసం ఎంత వరకైనా ఉద్యమిస్తా మని స్థానికులు స్పష్టం చేశారు. శ్రీరామలింగేశ్వరనగర్‌లో ఎన్నెస్పీ కాలువ కట్ట పక్కన జనావాసాల మధ్య రెండు మద్యం దుకాణాలు ఏర్పాటు చేశారు.

ఆబ్కారీ సీఐ సాయిస్వరూప్ దుకాణాలను పరిశీలించారు. తమకు తెలియకుండా మద్యం విక్రయించవద్దని, వెంటనే ఇక్కడి నుంచి తరలించాలని నిర్వాహకులకు సూచించారు. స్థానికులు నుంచి తీవ్రమైన ప్రతిఘటన ఎదురుకావడం, అధికారుల ఆదేశాల నేపథ్యంలో దుకాణాలకు తాళాలు వేశారు. స్థానిక శ్రీవిద్యా స్కూలుకు సమీపంలోనే ఒక దుకాణం ఉండగా, మరొకటి కొద్ది దూరంలో ఏర్పాటు చేశారు.

మందుబాబుల నుంచి ఇబ్బందులు ఎదురవుతాయని ఈ ప్రాంత మహిళలు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు.

పాత నోట్ల జమకు మరో

## అవకాశమివ్వండి

- సుప్రీంకోర్టు కేంద్రానికి సూచన



దిల్లీ: పాతనోట్లు జమ చేయలేకపోయినందుకు సరైన కారణాలు చెప్పే నిజాయతీపరులకు మరో అవకాశాన్ని కల్పించాలని సుప్రీంకోర్టు కేంద్రానికి సూచించింది. దీనిపై రెండు వారాలలోగా స్పందన తెలియజేయాలని పేర్కొంది. పాతనోట్ల రద్దుపై దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై

తరువాయి 2లో




## టేకిట్ ఈజీ



రాంగ్ టైమ్‌లో ఇంజనీరింగ్ కాలేజి పెట్టినట్టున్నాం సార్... డొనేషన్ కట్టే విద్యార్థులు కరవైపోయారు !!

## బెజవాడలో బ్రహ్మాండ నాయకుడు

### వైభవంగా ప్రారంభమైన వెంకన్న వైభవోత్సవాలు



విజయవాడ : ఏడుకొండల వాడా... వెంకటరమణా... గోవిందా... గోవిందా... అంటూ శ్రీ వెంకటేశ్వర నామస్మరణతో స్వరాజ్యమైదానం మారుమోగింది. తితిదే శ్రీనివాస కల్యాణం, ఎస్.వి.వైభవోత్సవం ప్రాజెక్టు సంయుక్త ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా శ్రీ వెంకటేశ్వర వైభవోత్సవాలు ప్రారంభమయ్యాయి. తితిదే ఆస్థాన పండితుల ఆధ్వర్యంలో వేదమంత్రాలు, బాజాభజంత్రీల సాక్షిగా పుణ్యాహవచనం నిర్వహించారు. శ్రీనివాస గోవిందా... శ్రీ వెంకటేశ గోవిందా... అంటూ స్వామి వైభ వాన్ని కీర్తిస్తూ వైభవోత్సవాలకు అంకురార్పణ చేశారు. వాస్తుశాంతి హోమం, అనంతరం విష్వక్సేన పూజను ఘనంగా నిర్వహించారు. గోవిందా హరి

తరువాయి 2లో

# రాయితీ పాసులపై ప్రత్యేక దృష్టి



అద్దంకి : విద్యార్థులకు, ప్రయాణికులకు అందించే రాయితీ పాస్‌లపై యాజమాన్యం ప్రత్యేక దృష్టి సారించినట్లు ఆర్‌ఎం కె.ఆదాం సాహెబ్ అన్నారు. అద్దంకి ఆర్టీసీ డీపోలో దస్త్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ మే, జూన్ నెలల్లో ప్రకాశం రీజియన్ రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచిందని చెప్పారు. అయితే జులై నెలలో మాత్రం ప్రయాణికుల సాంద్రత(ఓఆర్) తగ్గుతుందన్నారు. అందుకు అనుగుణంగా ఎక్కడ డిమాండ్ ఉంటే అక్కడ బస్సుల సంఖ్య పెంచడం, డిమాండ్ లేని చోట బస్సుల సంఖ్య తగ్గించడం వంటి చర్యలు చేపట్టామని తెలిపారు. ఆర్టీసీ బస్సులు తిరుగుతున్నా ప్రయాణికులు లేని చోట 'గడప గడపకు ఆర్టీసీ' అనే నినాదంతో సిబ్బంది ఇంటింటి ప్రచారం చేస్తున్నారన్నారు. ఆర్టీసీ అందించే రూట్‌పాస్‌లు, ప్రత్యేక అవసరాలున్న వారికి అందించే పాస్‌లపై మండలాల వారీగా ప్రత్యేక తేదీల్లో అందిస్తున్నట్లు వివరించారు. జిల్లాలో 35 వేల మంది దివ్యాంగులుండగా.. ఆరు వేల మంది మాత్రమే పాసులు పొందుతున్నట్లు తెలిపారు. కళాశాలల వద్ద ప్రత్యేక శిబిరాలు నిర్వహించి ఈ ఏడాది 90 వేల పాస్‌లు అందజేయాలనే యోచనలో ఉన్నామన్నారు. కార్యక్రమంలో డీఎం బి.రామ్మోహనరావు ఉన్నారు.

# ఆర్యవైశ్యులకు తితిదే ఛైర్మన్ పదవి ఇవ్వాలి

కర్నూలు : సామాజిక, సాంస్కృతిక, ధార్మిక రంగాల్లో తమవంతు చురుకైన పాత్ర పోషిస్తూ సమాజాభివృద్ధిలో కీలక భాగస్వాములైన ఆర్యవైశ్యులకు తితిదే పాలకమండలి ఛైర్మన్ పదవిని ఇవ్వాలని ఆర్యవైశ్య హక్కుల సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు టీజీ భరత్ అన్నారు. సోమవారం ఆయన కార్యాలయ గదిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీజీ భరత్ మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో అర్యవైశ్యులు 10 శాతం ఉన్నారని, దేవాదాయ ధర్మాదాయకు చెందిన సంస్థల్లో తమ ప్రాతినిధ్యం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. విజయవాడ కనకదుర్గమ్మ గుడి పాలకమండలిలో తమ ప్రాతినిధ్యంపై ముఖ్యమంత్రి చంద్రబాబును కోరగా ఆయన సానుకూలంగా స్పందించి ఆర్యవైశ్యులకు సముచిత స్థానం కల్పించారని, అందుకు సీఎంకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

అదేవిధంగా తితిదే పాలక మండలిలో ఆర్యవైశ్యులను భాగస్వాములు చేయాలని, ఛైర్మన్ పదవి ఇవ్వలేని పక్షంలో పాలక మండలి సభ్యులుగా ఇద్దరికి అవకాశం కల్పించాలన్నారు. సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇల్లూరు లక్ష్మయ్య మాట్లాడుతూ సామాజిక కార్యక్రమాలు, సత్కార్యాలకు తమను పరిమితం చేయకుండా ధార్మిక సేవలు చేసే భాగ్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య హక్కుల సాధన సమితి ప్రతినిధులు తిరుపాల్‌బాబు, శమంతకమణి, విఠల్‌శెట్టి, సోమిశెట్టి నవీన్, బైసాని పద్మజ, ధ్యానేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# సీఐటీయూ మహాధర్నా ఉద్రిక్తం

కర్నూలు : సంఘటిత, అసంఘటిత రంగ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన మహాధర్నా ఉద్రిక్తంగా మారింది. కలెక్టరేట్ వద్ద చేపట్టిన ఈ కార్యక్రమానికి వందలమంది కార్యకర్తలు తరలివచ్చారు. సంఘం నాయకులు రామాంజనేయులు, నాగరాజు, రాధాకృష్ణ, నాగేశ్వర్ రావు, ఐద్వా సంఘం నాయకురాలు నిర్మల, పుల్లారెడ్డి, గోపాల్, మాజీ కార్పొరేటర్ రాముడు పాల్గొని ప్రసంగించారు. తెలుగుదేశం ప్రభుత్వం కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న ఒప్పంద కార్మికుల వేతనాలు తెలంగాణ రాష్ట్రంలో పెంచిన విధంగా ఆంధ్రప్రదేశ్‌లో పెంచాలని డిమాండు చేశారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం అజెండాలోకి తేవాలని కోరారు. చట్టాలను సవరించి కార్మికుల హక్కులనే కాలరాసిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అనంతరం కార్మికులతో కలిసి కలెక్టరేట్‌లోకి ప్రవేశించేందుకు ప్రయత్నించారు. పోలీసులు ముందు జాగ్రత్తగా కంచె ఏర్పాటు చేయడంతో వారి ప్రయత్నం విఫలమైంది. కాస్త తోపులాట జరిగింది. అనంతరం డీఆర్వో గంగాధర్ గౌడ్ బయటకువచ్చి వారి సమస్యలు వినడంతో ఉద్యమకారులు శాంతించారు.

# చెన్నైకి 15 నుంచి 'పోరూరు' నీరు

చెన్నై : నగరంలో భూగర్భ జలాలు కూడా అడుగంటడంతో చెన్నైవాసులు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చెన్నైకి తాగునీటిని అందించే పూండి, పుళల్, సెంబరంబాక్కం, చోళవరం మొదలైన జలాశయాలు పూర్తిగా ఎండిపోయాయి. ఆంధ్రప్రదేశ్‌లోని కండలేరు జలాశయం నుంచి తమిళనాడుకు రావల్సిన నీరు కూడా రాలేదు. వీరాణం చెరువులోనూ నీరు లేదు. ఇలా అన్ని జలవనరులు ఎండిపోవటంతో చెన్నై ప్రజలు తాగునీటికి అష్టకష్టాలు పడుతున్నారు. 200 అడుగుల లోతుకు బోర్లు వేసినా నీరు లభించటం లేదు. ఈ స్థితిలో తాగునీటి శాఖ సమస్య పరిష్కారానికరి మార్గాలను అన్వేషిస్తోంది. ప్రస్తుతం పోరూరు జలాశయంలోని నీటిని శుద్ధీకరించి వినియోగించాలని నిర్ణయించింది. ఈ పనులు 10 రోజులలో పూర్తి కానున్నాయి.

ఈ నెల 15వ తేదీ నుంచి సరఫరా చేసే అవకాశాలు ఉన్నాయి.

ఎన్ని యత్నాలు చేసినా వానలు కురిస్తేనే ఎద్దడి సమస్య పరిష్కారం అవుతుందని అధికారులు చెబుతున్నారు.

# ప్లీనరీ విజయవంతం : కాకాణి

నెల్లూరు : జిల్లా ప్లీనరీ పూర్తిస్థాయిలో విజయవంతమైందని వైకాపా జిల్లా పార్టీ అధ్యక్షుడు కాకాణి గోవర్దన్‌రెడ్డి అన్నారు. నెల్లూరులోని పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా ప్లీనరీలో ప్రజా సమస్యలను చర్చించామని, వీటిని ఈనెల 8, 9 తేదీల్లో జరిగే రాష్ట్ర ప్లీనరీలో తీర్మానాలు చేస్తామన్నారు. నేడు ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజలు గుర్తించి వైకాపా వైపు వస్తున్నారని తెలిపారు. ప్లీనరీ విజయవంతానికి కృషి చేసి ప్రతి నాయకుడికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కారుణ్య నియామక పత్రాల అందజేత

ఒంగోలు : జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి కారుణ్య నియామకాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి కలెక్టర్ నియామక పత్రాలు అందజేశారు. బత్తుల మాణిక్యమ్మను ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో ఆయాగా, మేరుగ స్వప్నను సాంఘిక సంక్షేమశాఖలో కామాటిగా, సాధు నాగమణిని కామాటిగా, టి.మహేశ్వర వెంకటబాబును కలెక్టరేట్‌లో ఆఫీస్ సబార్డినేట్‌గా, పి.రామకృష్ణను దేవరంపాడు వీఆర్వోగా నియమించారు. ఎస్సీ ఎస్టీ కేసుల్లోని బాధితుల కుటుంబాల సభ్యులకు నష్టపరిహారాన్ని అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జిల్లా రెవెన్యూ అధికారి ప్రభాకరరెడ్డి, ఏవో రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# బహుమతులుగా ఇత్తడి నమూనాలు

బ్రహ్మపురనగరం : బ్రహ్మపుర ఖ్యాతి, గంజాం జిల్లా హస్తకళల ప్రత్యేకతను దేశ ప్రధాని నరేంద్ర మోదీ, భాజపా జాతీయాధ్యక్షుడు అమిత్ షాలకు వివరించేందుకు నగరానికి చెందిన ఇత్తడి నమూనాల తయారీదారుడు సందక ఆనందరావు రెండు నమూనాలను సిద్ధం చేశారు. మంగళవారం అమిత్ షా గంజాం జిల్లా పర్యటన సందర్భంగా రెండు నమూనాలను ఆయనకు అందజేస్తానని ఆనందరావు పేర్కొన్నారు. సోమవారం ఆయన వీటికి తుది మెరుగులు దిద్ది సిద్ధం చేశారు. ఇత్తడితో 'గ్రేటర్ ఇండియా' పేరుతో రూపొందించిన ఈ నమూనాల్లో జాతీయ పతాకం, మేక్ ఇన్ ఇండియా చిహ్నం (సింహం), స్వచ్ఛభారత్ చిహ్నం (బాపూ కళ్లద్దాలు) రూపొందించారు. మంగళవారం అంబపువా వివేక్ విహార్‌లో బూత్ స్థాయి సమావేశంలో పాల్గొనే అమిత్ షాకు ఈ ఇత్తడి నమూనాలు అందజేస్తానని, వాటిలో ఓ నమూనాను ప్రధాని మోదీకు అందజేయాల్సిందిగా షాను కోరుతానని ఆనంద రావు చెప్పారు. సమావేశంలో అమిత్ షాను కలుసుకుని బహుమతి ఇచ్చేందుకు అవకాశం ఇస్తామని భాజపా జిల్లా అధ్యక్షుడు కన్హుచరణ పతి తనకు హామీ ఇచ్చారని ఆయన పేర్కొన్నారు.

# పెంచిన వైద్య విద్య ఫీజులను తగ్గించాలి

బళ్లారి : ప్రైవేట్ వైద్య కళాశాలల ఒత్తిడికి లొంగి రాష్ట్ర ప్రభుత్వం వైద్య విద్య ఫీజులు పెంచడం సరికాదు. పెంచిన ఫీజులను తక్షణమే తగ్గించాలని ఎ.ఐ.డి.ఎస్.ఒ. రాష్ట్ర అధ్యక్షుడు డా.ప్రమోద్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వరసగా మూడేళ్లుగా వైద్య విద్య ఫీజులు పెంచుతూ వస్తోంది. ఈ ఏడాది కూడా కూడా ప్రైవేట్ కళాశాలల్లో, ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 10శాతం ఫీజులు పెంచాలని నిర్ణయించింది.

# రైల్వే స్టేషన్లలో 'క్యాన్ నీటి'పై నిషేధం

విల్లివాక్కం : రెల్వేస్టేషన్‌లలో చౌక ధర నీటి కేంద్రాలలో క్యాన్ నీటిని విక్రయించడాన్ని ఐఆర్‌సీటీసీ (ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్) నిషేధించింది. చెన్నై సెంట్రల్, ఎగ్మూరు, మాంబలం, తాంబరంతోపాటు శివారు స్టేషన్లలో గుత్తేదారుల ద్వారా ఈ సంస్థ చౌక ధర తాగునీటి కేంద్రాలను నిర్వహిస్తోంది. వీటికోసం బయటి ప్రాంతాల నుంచి తక్కువ ధరకు క్యాన్ నీటిని విక్రయిస్తున్నట్టు ప్రయాణికుల నుంచి ఫిర్యాదులు అందాయి. ఈ సమాచారంతో ఐఆర్‌సీటీసీ అధికారులు వెంటనే తనిఖీలు చేపట్టారు. ఆరోపణలు నిజమని తేలింది. వెంటనే క్యాన్ నీటి విక్రయాన్ని నిషేధించారు. ఆయా కేంద్రాలలో నేరుగా యంత్రం ద్వారా శుద్ధీకరించిన నీటినే విక్రయించాలని, అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆ ప్రకారం సబర్బన్ రైల్వేస్టేషన్లలోని చౌక నీటి కేంద్రాలలో క్యాన్ వాటర్ విక్రయాన్ని నిలిపివేశారు.

**మొదటి పేజీ తరువాయి**

# అగ్రనేతలిద్దరూ మళ్లీ కలుస్తున్నారు...

హంబర్గ్‌లో జరిగే జీ-20 సదస్సు సందర్భంగా బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా దేశాలు లాంఛనపర్వకంగా సమావేశమై చర్చలు జరుపుతారని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. అయితే తాజా పరిస్థితుల నేపథ్యంలో చైనా, భారత్ నేతల సమావేశానికి ఎక్కువ ప్రాధాన్యం ఉందని వీరంటున్నారు. సరిహద్దులపై భారత-చైనా మధ్య మాటల యుద్ధం దాదాపు నెలరోజులుగా ముదురుతోంది. సిక్కిం సరిహద్దుల్లోని డోకా లా ప్రాంతం తమదేనని, తాము చేపట్టే రోడ్డు నిర్మాణానికి భారత్ అడ్డుపడటం తమ సార్వభౌమాధికారాన్ని ధిక్కరించడమేనని చైనా భారత్‌పై విరుచుకుపడుతుండగా, డోకా లా భూటాన్‌లోని వస్తుందని, అక్కడ రోడ్డు నిర్మించడమంటే యథాతథ స్థితిని దెబ్బతీయడమేనని భారత్ బలంగా వాదిస్తోంది. భూటాన్ భద్రతతో తమ దేశ భద్రతా ముడిపడి ఉందని నొక్కిచెబుతోంది.

# ప్రజాస్వామ్యంలో ఎవరైనా పోటీ చేయవచ్చు

ఉందని తెలిసినా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని నిలబెట్టిందని... ప్రజాస్వామ్యంలో ఎవరైనా పోటీ చేసే హక్కు ఉందన్నారు.

**తెరాస తొలినుంచీ మద్దతిచ్చింది**

రాష్ట్రపతి అభ్యర్థిగా ఎన్డీయే తన పేరును ప్రకటించినప్పటి నుంచి తెరాస మద్దతు పలుకుతూ వచ్చిందని ఎన్డీయే రాష్ట్రపతి అభ్యర్థి రామ్‌నాథ్ కోవింద్ అన్నారు. రాష్ట్రపతి ఎన్నికల ప్రచారంలో భాగంగా హైదరాబాద్ జలవిహార్‌లో తెరాస నేతలతో రామ్‌నాథ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్‌కు రెండు విధాలుగా కృతజ్ఞతలు చెబుతున్నారు. ఒకటి దారి పొడవునా తనకు స్వాగత ద్వారాలు ఏర్పాటు చేసినందుకు.. రెండోది హిందీ మాట్లాడే వ్యక్తిని కాబట్టి హిందీలోనే ప్రసంగించినందుకు. నేను బిహార్ గవర్నర్‌గా ఏ పార్టీతోనూ సంబంధం లేకుండా బాధ్యతలు నిర్వర్తించా.. రాష్ట్రపతిగానూ అదేవిధంగా బాధ్యతలు నిర్వర్తిస్తా. రాజ్యాంగబద్ధ పదవులు స్వీకరించినప్పుడు వాటికి న్యాయం చేయాలి. అని అన్నారు.

**భాజాపా నేతలతో భేటీ**

తెలుగు రాష్ట్రాల్లో ప్రచారం నిమిత్తం హైద్రాబాద్ చేరుకున్న రామ్‌నాథ్ కోవింద్‌కు బేగంపేట విమానాశ్రయంలో కేంద్రమంత్రులు వెంకయ్యనాయుడు, బండారు దత్తాత్రేయ, తెలంగాణ మంత్రులు, నాయిని నర్సింహారెడ్డి, మహమూద్ అలీ, భాజపా నేతలు తదితరులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. అక్కడి నుంచి నేరుగా హరిత ప్లాజా చేరుకుని భాజపా నేతలతో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో లక్ష్మణ్, కిషన్‌రెడ్డి సహా భాజపా ఎమ్మెల్యేలు, నేతలు పాల్గొన్నారు.

**వైకాపా నేతలతో సమావేశం**

భాజాపా నేతలతో భేటీ అనంతరం రామ్‌నాథ్ కోవింద్ పార్క్ హయత్ హోటల్‌లో వైకాపా అధినేత జగన్‌తో భేటీ అయ్యారు. ఈ భేటీలో జగన్‌తో పాటు ఎంపీలు విజయసాయిరెడ్డి, మేకపాటి రాజమోహన్‌రెడ్డి, సీనియర్ నేత ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, వైకాపా ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. రామ్‌నాథ్ కోవింద్‌ను జగన్ శాలువా కప్పి సత్కరించారు. పార్టీ ఎమ్మెల్యేలను జగన్ స్వయంగా రామ్‌నాథ్‌కు పరిచయం చేశారు. రాష్ట్రపతి ఎన్నికలకు సంబంధించి జగన్ ఇప్పటికే తన మద్దతు రామ్‌నాథ్‌కు ప్రకటిచిన సంగతి తెలిసిందే.

# జీఎస్‌టీపై రాహుల్ గాంధీ విజయం

పలకలు, రైటింగ్ గైడ్స్, స్క్రిప్ట్ రైటింగ్ గైడ్స్, స్టైలీ, బ్రెయిలీ ఎరేజర్లు వంటి చేతిరాత పరికరాలు.

కేన్స్, సోనిక్ గైడ్స్ వంటి ఎలక్ట్రానిక్ సహాయ పరికరాలు.

ఆప్టికల్, ఎన్విరాన్‌మెంటల్ సెన్సర్స్.

అరిథ్‌మెటిక్, ఆల్జీబ్రా టైప్స్ టేలర్ ఫ్రేమ్స్, క్యూబారిథమ్, స్పీకింగ్, బ్రెయిలీ కేలిక్యులేటర్లు.

కంబైన్డ్ గ్రాఫ్ వంటి జామెట్రియల్ ఎయిడ్స్, మ్యాథమెటికల్ డిమాన్‌స్ట్రేషన్ బోర్డ్, బ్రెయిలీ ప్రొట్రాక్టర్స్, స్కేల్స్, కంపాస్‌లు, స్పార్ వీల్స్.

కాలిపర్స్, మైక్రోమీటర్స్, కంపేరేటర్స్, గాజెస్, గాజ్ బ్లాక్ లెవెల్స్, రూల్స్, రూలర్స్, యార్డ్‌స్టిక్స్ వంటి ఎలక్ట్రానిక్ మెజరింగ్ ఎక్విప్‌మెంట్.

డ్రాఫ్టింగ్, డ్రాయింగ్ ఎయిడ్స్, టాక్టైల్ డిస్‌ప్లేస్.

ప్రత్యేకంగా రూపొందించిన గడియారాలు. గోడ గడియారాలు.

మొదటి షెడ్యూలులోని నెం.90.21 హెడింగ్ క్రిందకు వచ్చే ఆర్థోపెడిక్ ఉపకరణాలు.

మొదటి షెడ్యూలులోని నెం.87.13 హెడింగ్ క్రిందకు వచ్చే వీల్ చైర్స్.

కృత్రిమ ఎలక్ట్రానిక్ లేరింక్స్, దాని విడి భాగాలు.

కృత్రిమ ఎలక్ట్రానిక్ చెవి (కోఫ్లర్ ఇంప్లాంట్)

క్యాసెట్లు, డిస్కులు, ఇతర సౌండ్ రీప్రొడక్షన్ రూపంలోని టాకింగ్ బుక్స్, భారీ ప్రింట్ బుక్స్, బ్రెయిలీ ఎంబోజర్స్, టాకింగ్ కాలిక్యులేటర్లు, టాకింగ్ థర్మామీటర్లు.

బ్రెయిలీని యాంత్రికంగా లేదా కంప్యూటర్ ద్వారా సృష్టించే పరికరాలు, బ్రెయిలీ కంప్యూటర్ టెర్మినల్స్, డిస్‌ప్లేస్, ఎలక్ట్రానిక్ బ్రెయిలీ, ట్రాన్స్‌ఫర్, ప్రెస్సింగ్ మెషిన్స్, స్టీరియో టైపింగ్ మెషిన్స్.

బ్రెయిలీ పేపర్

అంధుల కోసం తయారు చేసిన అన్ని వస్తువులు, పరికరాలు, ప్రత్యేకంగా రూపొందించిన వస్తువులు.

అంధులకు దారి చూపే ఎలక్ట్రానిక్ పరికరాలు, అడ్డంకులను గుర్తించే పరికరాలు, వైట్ కేన్స్.

విద్య, పునరావాసం, వృత్తి శిక్షణకు ఉపయోగపడే సాంకేతిక పరికరాలు. బ్రెయిలీ టైప్‌రైటర్స్, బ్రెయిలీ గడియారాలు. టీచింగ్, లెర్నింగ్ ఎయిడ్స్, గేమ్స్, ఇతర పరికరాలు, అంధుల కోసం ఉపయోగించే ప్రత్యేక పరికరాలు.

వినికిడి యంత్రాలు, ఆడియో మీటర్లు.

యూరిన్ కలెక్షన్ బ్యాగులు, జెల్లీ కుషన్స్ వంటి వస్తువులు.

తీవ్ర శారీరక వైకల్యంగల రోగులకు ఉపయోగపడే పరికరాలు, జాయింట్ రీప్లేస్‌మెంట్, వెన్నెముక సంబంధిత పరికరాలు.

# పాత నోట్ల జమకు మరో అవకాశమివ్వండి

జరిగింది. ఈ సందర్భంగా కేంద్రానికి, ఆర్బీఐకి సర్వోన్నత న్యాయస్థానం పలు ఆదేశాలు జారీ చేసింది. పాత రూ.500, రూ.1000 నోట్లను రద్దు చేస్తూ.. గతేడాది నవంబర్‌లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ సంచలన నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. 2016 డిసెంబర్ 30లోగా పాతనోట్లను బ్యాంకుల్లో జమచేసుకోవాలని కేంద్రం స్పష్టం చేసింది. ఇంకా కొందరు వ్యక్తులు పాతనోట్లను బ్యాంకుల్లో డిపాజిట్ చేసుకోలేకపోయారు. తమకు మరో అవకాశం కల్పించాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిల్ వేశారు. దీనిపై నేడు న్యాయస్థానం విచారణ చేపట్టింది. సరైన కారణాలతో డబ్బు జమచేయలేకపోయిన నిజాయతీపరులకు మరో అవకాశాన్ని కల్పించాలని సూచించింది. ఉదాహరణకు కేంద్రం చెప్పిన గడువు సమయంలో ఓ వ్యక్తి జైల్లో ఉంటేగనుక, ఆ వ్యక్తికి ఇప్పుడు అవకాశం ఇవ్వకపోవడం సరికాదని పేర్కొంది. ఇలాంటి వ్యక్తులకు ఎలా సాయపడతారు. వీరి కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తారా? అంటూ ప్రశ్నల వర్షం కురిపించింది. దీనిపై రెండు వారాల్లోగా స్పందన తెలియజేయాలని ఆదేశించింది. సుప్రీం నిర్ణయంపై స్పందించిన కేంద్ర ప్రభుత్వం దీనిపై సమగ్ర నివేదికతో అఫిడవిట్ దాఖలు చేస్తామని కోర్టుకు చెప్పింది. ఈ కేసులో తదుపరి విచారణను న్యాయస్థానం జులై 18కి వాయిదా వేసింది.

# బెజవాడలో బ్రహ్మాండ నాయకుడు

గోవిందా... నిత్య నిర్మల గోవిందా... అంటూ వీనులవిందైన పాటలు ఆలపిస్తూ విష్వక్సేనుల వారి తిరువీధి ఉత్సవం ప్రారంభమైంది. స్వామి వారిని ప్రత్యేకమైన పల్లకిపై మాడవీధుల్లో వూరేగించారు. వందలాది సంఖ్యలో భక్తులు తరలిరాగా వేదమంత్రాలు, మంగళవాయిద్యాల సాక్షిగా స్వామి వారు మాడవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. వూరేగింపుగా వెళుతున్న స్వామిని దర్శించుకునేందుకు భక్తులు పోటీ పడ్డారు. అనంతరం స్వామిని ఆనందనిలయం వద్దకు తీసుకువచ్చి ఆరగింపు కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. గంటా నాదం సాక్షిగా స్వామివారికి ప్రసాదాలను నివేదించారు. వేదపండితులు హారతులిచ్చారు. అనంతరం శ్రీవారిని దర్శించుకునేందుకు భక్తులకు అనుమతించారు.

సాంస్కృతిక కార్యక్రమాలు.. సాయంత్రం 4 నుంచి 6.30 వరకు- పి.ఆర్.కౌసల్య, శ్రీకృష్ణ బృందం (హైదరాబాద్) ఆధ్వర్యంలో భక్తి సంగీతం; రాత్రి 7 నుంచి 8.15 వరకు మైలవరపు శ్రీనివాసరావు (హైదరాబాద్) ధార్మిక ఉపన్యాసం.

ఆకట్టుకున్న ఆధ్యాత్మిక ప్రసంగాలు

కుర్తాళం పీఠాధిపతి సిద్దేశ్వరానంద భారతీస్వామి ఆధ్మాత్మిక ప్రసంగం చేశారు. సిద్దేశ్వరానంద భారతీస్వామిని తితిదే జేఈఓ పోలాభాస్కర్ మంగళవాయిద్య సమేతంగా వేదగోష్ఠితో ఆహ్వానం పలికారు. శ్రీవారి శేషవస్త్రంతో సత్కరించారు. తరువాత గంగాధరశాస్త్రి భక్త సంగీత కార్యక్రమం ప్రేక్షకులను ఆకట్టుకుంది.

# త్రినాథ మందిరం పునః ప్రతిష్ఠోత్సవాలు

బ్రహ్మపురనగరం : స్థానిక కొమ్మలబాల వీధిలోని త్రినాథ మందిరంలో దేవతా మూర్తుల పునఃప్రతిష్ఠోత్సవాలు ఏర్పాటయ్యాయి. వేద మంత్రోచ్ఛారణలు, శాస్త్రోక్తంగా పూజల అనంతరం స్థానికులు పునరుద్ధరించిన మందిరలో దేవతా మూర్తులను పునఃప్రతిష్ఠించారు. గతంలో వీధిలోని ఈ మందిరాన్ని స్థానికులు పునరుద్ధరణ పనులు చేపట్టారు. దీంతో దేవతామూర్తులను సమీపాన చిన్నబజారు కూడలిలోని శివాలయంలో కొంతకాలం ఉంచారు. మందిరం పునరుద్ధరణ పనులు పూర్తయిన అనంతరంస్థానికులు మంగళవాయిద్యాల నడుమ దేవతామూర్తులను శివాలయం నుంచి వూరేగింపుగా వీధిలోని మందిరానికి తీసుకువచ్చారు.

# రాష్ట్ర అధికారాలను హరించేలా జీఎస్టీ అమలు చేయలేదు: హెచ్.రాజా

సేలం : కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర అధికారాలను హరించే విధంగా జీఎస్టీ పన్ను విధానాన్ని అమలు చేయలేదని భాజపా జాతీయ కార్యదర్శి హెచ్.రాజా తెలిపారు. అనేక కార్యక్రమాల్లో పాల్గొనడానికి సేలం నగరానికి వచ్చిన ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, దేశ వ్యాప్తంగా జీఎస్టీ అమలుకు వచ్చిందని గుర్తు చేశారు. జీఎస్టీ అమలుకు ముందు 29 రాష్ట్రాలు, 5 యూనియన్ ప్రదేశాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులతో పాటు 17 సమా వేశాలు నిర్వహించి పన్ను విధింపును నిర్ణయించారని తెలిపారు. అన్ని రాష్ట్రాలు తెలిపిన ఆమోదం మేరకు కేంద్రం జీఎస్టీ విధానం అమలులోకి వచ్చిందన్నారు. ఇందులో మద్యంకు, పెట్రోలియం వస్తువులకు ఎందుకు జీఎస్టీ నుంచి మినహాయంపు ఇచ్చారని అడుగుతున్నారు. అందుకు రాష్ట్ర ప్రతినిధుల నిర్ణయం మేరకే ప్రస్తుతానికి పన్ను విధించలేదని తెలిపారు.

తమిళ నాడులో మద్యం విక్రయాలను అడ్డుపెట్టుకొనే డీఎంకే, అన్నాడీఎంకే ప్రభుత్వాలు ఉచిత పథకాలను అమలు చేశాయని గుర్తు చేశారు. రాజకీయ లబ్ధికోసం రాజకీయ పార్టీలు జీఎస్టీని విమర్శిస్తున్నాయని, ఈ విధానం వల్ల రాష్ట్రాలకు నష్టం ఏర్పడితే ఐదు సంవత్సరాలు నష్టాన్ని భరిస్తుందని కేంద్రం భరోసా ఇచ్చిందని తెలిపారు. ఆ మేరకు మహారాష్ట్ర, గుజరాత్, తమిళనాడు, హర్యానా రాష్ట్రాలకు అదనంగా మూడు సంవత్సరాలతో పాటు 8 సంవత్సరాలు పన్ను నష్టాన్ని కేంద్రం భరిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వాల అధికారా లను హరించే విధంగా జీఎస్టీని అమలు చేయలేదని చెప్పిన ఆయన రాష్ట్ర ప్రభుత్వాలు తెలిపిన ఉద్దేశాల మేరకే నిర?యించారని తెలిపారు. రూ. 20 లక్షల కింద ఆదాయం ఉండే వారు జీఎస్టీ పరిధిలోకి రారని, రూ. 20 లక్షలకు పైగా ఆదాయం ఉన్న వారికే జీఎస్టీ వర్తిస్తుందని తెలిపారు.

దేశవ్యాప్తంగా టోల్ ప్లాజాల్లో లంచం ఇచ్చి నిత్యావసర వస్తువుతో పాటు మిగిలిన వస్తువులను రవాణా చేస్తున్నందున సరుకు వచ్చి చేర డంలో ఆలస్యం అయ్యేదని, కాని ప్రస్తుతం ఒకే పన్ను విధానం దేశ వ్యాప్తంగా అమలులోకి వచ్చినందున సరుకులు త్వరగా వచ్చి చేరుతాయన్నారు. ప్రధాని మోదీ సుమారు మూడు లక్షల సంస్థలు అక్రమంగా పనిచేస్తున్నాయని తెలిపారని, నల్లధనాన్ని నిర్మూలించడానికి కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకొంటొంటోందని తెలిపారు. సేలంలో ఆడిటర్ రమేష్ హత్యకు గురై నాలుగు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఈ కేసుతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న హిందూ సంస్థల నేతల హత్య కేసుల్లో ఎటువంటి పురోగతి లేదని ఆరోపించారు. ఈ హత్యకేసులకు సంబంధించి నిందితులను అరెస్టు చేయడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి చర్యలు తీసు కోవాలని కోరారు. కాని పోలీసు అధి కారులు ముస్లిం తీవ్రవాదులకు భయపడి ఎటువంటి చర్యలు తీసు కోవడంలేదని విమర్శించారు.

డీఎంకే కార్యాధ్యక్షుడు స్టాలిన్ హిందువులకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారని అన్నారు. కాని స్టాలిన్ ఎప్పటికీ ముఖ్య మంత్రి అయ్యే అకాశం లేదని జోస్యం చెప్పారు. ఈ సమావేశంలో సేలం నగర జిల్లా అధ్యక్షుడు గోపీనాథ్, నిర్వాహకులు అనేక మంది పాల్గొన్నారు.

# ఇన్‌పుట్ రాయితీ అవకతవకలపై చర్యలు తీసుకోవాలి

ఒంగోలు : కొరిశపాడు మండలం రావినూతల గ్రామ మినుము రైతులకు ఇన్‌పుట్ రాయితీ ఇవ్వడంలో వ్యవసాయశాఖ అధికారులు అవకతవకలకు పాల్పడ్డారని గ్రామ రైతులు కలెక్టరు వినయ్‌చంద్‌కు ఫిర్యాదు చేశారు. దేవుడు వరమిచ్చినా పూజారి వరమివ్వడన్న చందాన ప్రభుత్వం ప్రకటించినా.. వ్యవసాయశాఖ అధికారులు నష్టపోయిన మినుము రైతుల వివరాలను నమోదు చేయకుండా మోసం చేశారన్నారు. కేవలం కొంత మంది రైతుల పేర్లను నమోదు చేసి.. మండలంలోని వందలాది మంది రైతులకు అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే విచారించి చర్యలు తీసుకోవాలన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో గ్రామ రైతులు ఎం.వెంకటేశ్వర్లు, కె.శ్రీనివాసరావు, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి.వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

## విజయవాడ ప్రాంతీయ వార్తలు

## పాఠశాలలు దేవాలయాల్లాంటివి

గూడూరు : 'పాఠశాలలు దేవాలయాల్లాంటివి. ఐజీగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత గుడికి, మసీదుకు వెళ్లకుండా నేరుగా పర్లలోని పాఠశాలకు వచ్చాను. ఇక్కడ పిల్లలతో గడపటం ఎంతో ఆనందంగా ఉంది' అని రాయలసీమ జోన్ ఐజీ మహ్మద్ ఇక్బాల్ అన్నారు. కల్లూరు మండలంలోని పర్ల గ్రామ జడ్పీ ఉన్నత పాఠశాలను ఐజీ సందర్శించారు. ఆయన వెంట జిల్లా ఎస్పీ గోపీనాథ్ జెట్టి, డీఎస్పీ రమణమూర్తి, కర్నూలు గ్రామీణ సీఐ నాగరాజుయాదవ్ ఉన్నారు. తాను కోవెలకుంట్ల గ్రామానికి చెందిన వాడినని, తన తండ్రి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడిగా పని చేశారని తెలిపారు. జీవితంలో ఉన్నత పదవులు అలంకరించిన వారిలో చాలా మంది ప్రభుత్వ పాఠశాలల్లో చదినవారేనని అన్నారు. స్థానిక పాఠశాలలో సమస్యలుంటే విన్నవించాలని ప్రధానోపాధ్యాయుడు నారాయణ, విద్యార్థిని, విద్యార్థులను అడిగారు. ఇందుకు ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ పాఠశాలకు ప్రహరి, కంప్యూటర్లు, మరుగుదొడ్లు లేవని, గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం లేదని తెలిపారు. ఇందుకు ఐజీ స్పందించి తాను నాలుగు కంప్యూటర్లు ఇస్తానని ప్రకటించారు. పాఠశాల సమస్యలు పరిష్కరించే దిశగా పని చేయాలని సీఐ నాగరాజు యాదవ్, కె.నాగులాపురం ఎస్ఐ మల్లికార్జున, సర్పంచి శేఖర్‌కు సూచించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ తాను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివానని, ఆ పాఠశాలలను జీవితంలో మరువలేనన్నారు. చదివి ఏ ఉద్యోగంలో చేరినా తమ వంతుగా పాఠశాలలకు ఏదో ఒక రకంగా సాయం చేయాలని ఎస్పీ సూచించారు. ఎస్పై మల్లికార్జున పర్ల జడ్పీ ఉన్నత పాఠశాలను దత్తత తీసుకొని అభివ ృద్ధి చేస్తుండటంతో అభినందించారు. ఈ సందర్భంగా ఆయనకు పూల మాలలు, శాలువా కప్పి సత్కరించారు. చివరగా 9వ తరగతి విద్యార్థినులకు ఐజీ సైకిళ్లను పంపిణీ చేశారు.

## పండిట్ పరీక్షలకు 10లోగా ఫీజు చెల్లించాలి

ఒంగోలు : 2016-17 సంవత్సరం బ్యాచికి చెందిన టీపీటీ, హెచ్‌పీటీ పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులు తిరిగి పరీక్ష రాయడానికి, నామినల్ రోల్స్ సమర్పించడానికి షెడ్యూల్ విడుదల చేసినట్లు డీఈవో విజయభాస్కర్ తెలిపారు. అపరాధ రుసుము లేకుండా ఈ నెల పదో తేదీలోగా ఫీజు చెల్లించాలన్నారు. కళాశాల ప్రిన్సిపళ్లు ఈ నెల 21లోగా నామినల్ రోల్స్ సమర్పించాలన్నారు. రూ.50 అపరాధ రుసుముతో ఈ నెల 17లోగా ఫీజు చెల్లించాలన్నారు. మూడు పాఠ్యాంశాలకుపైన రూ.150, మూడు పాఠ్యాంశాలకు లోపు రూ.100 చొప్పున చెల్లించాలన్నారు.

విద్యార్థులు సంబంధిత కళాశాల ప్రధానాచార్యుల ద్వారానే ఫీజు చెల్లించాలన్నారు. ప్రధానాచార్యులు విద్యార్థుల దరఖాస్తులను ప్రాక్టికల్ మార్కులతో జత చేసి ఆన్‌లైన్ ద్వారా పంపాలని పేర్కొన్నారు.

# కార్మికులను పట్టించుకోకుంటే మహాగర్జనే



ఒంగోలు : కలెక్టరేట్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన మహాధర్నాలో కార్మికులు కదం తొక్కారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలంటూ వారు చేసిన నినాదాలతో కలెక్టరేట్ ఆవరణ మార్మోగింది. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సి.హెచ్.మజుందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఎం కేంద్ర కమిటీ కార్యదర్శి వర్గ సభ్యుడు వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్న సుప్రింకోర్టు తీర్పులను తుంగలో తొక్కి కార్మికుల శ్రమను నిలువునా దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. రాజ్యాంగం కల్పించిన పోరాట హక్కునూ ప్రభుత్వం కాలరాస్తోందని విమర్శించారు. పరిష్కారం కాంక్షిస్తూ సమస్యలను చెప్పుకోవడానికి వస్తే.. కార్మికుల నోరు మెదపకుండా చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఎన్నో పోరాటాల ద్వారా కార్మికులు సాధించుకున్న హక్కులనూ నేటి పాలకులు హరిస్తున్నారని మండిపడ్డారు. ఆర్థిక అసమానతలు రూపుమాపడానికి చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.18వేలు చెల్లించేలా.. వారి సంక్షేమం కోసం చర్యలు తీసుకుంటేనే దేశంలో అభివ ృద్ధి జరుగుతుందన్నారు. ఒప్పంద, పొరుగు సేవల విధానం ఎత్తివేసి... వారి ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని కోరారు.

కార్మికులు కన్నెర్ర చేస్తే..

ఉద్యమాలపై ఉక్కుపాదం మోపి ఆపాలనుకుంటే కార్మికులు కన్నెర్ర జేస్తారని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు ధ్వజమెత్తారు. శ్రమదోపిడీకి గురవుతున్న కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ.. ఉన్నవి పెరికేస్తున్నారని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. సీపీఎం జిల్లా కార్యదర్శి పూనాటి ఆంజనేయులు మాట్లాడుతూ ఎమ్మెల్యే జీతం రూ.లక్షగా ఉన్నా.. చాలడం లేదని మాట్లాడుకుంటుంటే... రూ.ఏడు వేలు, రూ.ఎనిమిది వేలతో కార్మికులు కుటుంబాలను ఎలా పోషించుకోవాలో చెప్పాలంటూ నిలదీశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించడానికి ప్రత్యేక జన్మభూమి జరపాలని, కార్మికుల బాట పెట్టాలన్నారు. లేదంటే కార్మికుల గర్జన, మహాగర్జనగా మారుతుందన్నారు. ధర్నా సందర్భంగా టెంటు ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతించకపోవడంతో కార్మికులు ఎండ వేడిమికి తాళలేక ఇబ్బందులు పడ్డారు. ధర్నా ప్రారంభమైన తర్వాత అధిక సంఖ్యలో కార్మికులు తాము కూర్చున్న పట్టలనే తలపై కప్పుకొని వినూత్నంగా నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు, సీఐటీయూ నాయకులు టి.మహేష్, జి.వి.రాగయ్య, ఎంసీహెచ్ వీరాంజనేయులు, కాలం సుబ్బారావు, సీహెచ్ గంగయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం డీఆర్వో ఎన్.ప్రభాకర్‌రెడ్డి సభ వద్దకు చేరుకుని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని చెప్పారు.

## ఐజీగా ఇక్బాల్‌బాషా బాధ్యతల స్వీకరణ

కర్నూలు : రాయలసీమ రేంజ్ ఐజీగా షేక్ మహ్మద్ ఇక్బాల్ బాషా బాధ్యతలు చేపట్టారు. బి.క్యాంపులోని కార్యాలయంలో ప్రస్తుత ఐజీ శ్రీధర్‌రావు నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు అనంతపురం రేంజ్ డీఐజీ జె.ప్రభాకర్‌రావు, కర్నూలు ఎస్పీ గోపీనాథ్‌జెట్టి, చిత్తూరు జిల్లా ఎస్పీ రాజశేఖర్‌బాబు, కడప జిల్లా ఎస్పీ అల్టాడ బాబూజీ, రెండో పటాలం దళాధిపతి సామ్యూల్‌జాన్, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రీజినల్ అధికారి శివకోటి బాబూరావు, అదనపు ఎస్పీ షేక్‌షావలి, ఐ.వెంకటేష్‌లు స్వాగత శుభాకాంక్షలు తెలిపారు.

ఐజీ జిల్లాకు చెందిన వారు కావటంతో స్థానికులు, పలు ప్రాంతాలకు చెందిన పలువురు మర్యాద పూర్వ కంగా కలిశారు.డీజీపీ కార్యాలయానికి బదిలీ అయిన ఐజీ శ్రీధర్ రావుకు ఘన వీడ్కోలు లభించింది. బి.క్యాంపులోని పోలీసు అతిథి గృహంలో శ్రీధర్‌రావును సత్కరించి, జాపికలు సమర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. కర్నూలు రేంజ్ డీఐజీగా పనిచేసి విజయవాడకు బదిలీ అయిన బి.వి.రమణ కుమార్‌కు సిబ్బంది సత్కరించి వీడ్కోలు పలికారు.

## వైభవంగా నృసింహ స్వాతి ఉత్సవం

ఆళ్లగడ్డ : అహోబిలం లక్ష్మీన ృసింహ స్వామి ఆలయంలో స్వామి జన్మ నక్షత్రం స్వాతి ఉత్సవం వైభవంగా జరిగింది. తెల్లవారు జామున లక్ష్మీన ృసింహ స్వామిని సుప్రభాత సేవతో మేల్కొల్పి నిత్య ఆరాధన జరిపారు. అనంతరం శ్రీ ప్రహ్లాదవరదను ప్రత్యేకంగా అలంకరించి గరుడ వాహనంపై కొలువుంచి ఆలయ మాఢ వీధుల్లో వూరేగించారు. మధ్యాహ్నం శ్రీప్రహ్లాదవరద, శ్రీదేవి, భూదేవి అమ్మవారిని ఆలయ మండపంలో కొలువుంచారు. స్వామికి ఏడాది పొడవునా ధరింపజేసినటువంటి బంగారు కవచాలను తొలగించి 108 కలశాలలతో జేష్టాభిషేకం నిర్వహించారు. బంగారు కవచాలను స్వామికి ధరింపజేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

సాయంత్రం పెరియాళ్వార్ ప్రచవనాలను స్వామికి విన్నవించారు. ఈ పూజల్లో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ వేడుకలు ఈఓ కామేశ్వరమ్మ, ప్రధానార్చకులు కిడాంబి వేణుగోపాలన్ ఆధ్వర్యంలో జరిగాయి.

### 108 కలశాలతో అభిషేకం

స్వాతి ప్రత్యేకత

ఆగమశాస్త్ర అనుసారం జేష్ఠ్య మాసంలో వచ్చే స్వాతి నక్షత్రం రోజున గరుడవాహన సేవ, అభిషేకం నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా నృసింహ స్వామి జన్మ నక్షత్రం స్వాతిని పురస్కరించుకొని స్వామి వారిని గరుడ వాహనంపై వూరేగించారు. దీంతో పాటు పాంచరాత్ర ఆగమ శాస్త్రం ప్రకారం స్వామి వారి బంగారు కవచాలను తొలగించి అభిషేకం చేస్తారు. ఇలా కవచాలు తొలగించి ఏడాదిలో ఒక్క సారి మాత్రమే అభిషేకం నిర్వహిస్తారు. ఈమేరకు స్వామి తిరుమేని (కవచాలు లేని స్వామి రూపం) దర్శనం సంవత్సరంలో ఒక్క సారే ఉంటుంది. దీని తర్వాత అహోబిలంలో 40 రోజుల వరకు ఎటువంటి అభిషేకాలు, ఉత్సవాలు జరగవు. అందుకనగా ఈ స్వాతిని ప్రత్యేకంగా పరిగణిస్తారు.

## ఎవరి సరిహద్దుల్లో వాళ్లు ఉండాలి: ఎమ్మెల్యే

విడవలూరు : సముద్రంలో ఆంధ్రా, తమిళనాడు మత్స్యకారులు ఎవరి హద్దుల్లో వారు వేట సాగించాలని ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. రామచంద్రాపురం యంపీటీసీ సభ్యుడు ఆవుల రవిచంద్ర ఆధ్వర్యంలో రామచంద్రాపురం పరిధిలోని కొత్తూరులో తమిళనాడు మత్స్యకారులు, తీర ప్రాంతంలోని మత్స్యకారులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరిహద్దు సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు, మత్స్యశాఖ మంత్రి ద ృష్టికి తీసుకెళతామన్నారు. ఇటువంటి సమస్యలు పునరావ ృతం కాకుండా తమిళనాడు, ఆంధ్ర మత్స్య శాఖ అధికారులు ఒప్పందం చేసుకోవాలన్నారు. గ్రామ కాపులు మాట్లాడుతూ 25 ఏళ్లుగా తమిళనాడు, ఆంధ్ర మత్స్యకారుల మధ్య సరిహద్దు సమస్యగా ఉందన్నారు. దీనిపై చేసుకున్న ఒప్పందాన్ని ఉల్లంఘించి తమిళనాడు మత్స్యకారులు రాష్ట్ర సముద్రతీరంలో చేపల వేట చే స్తున్నారన్నారు. నాలుగు రోజుల క్రితం రామచంద్రాపురానికి చెందిన మత్స్యకారులను చెన్నైకి చెందిన మత్స్యకారులు దాడి చేసి వలలను ఎత్తుకెళ్లడంతో ఆగ్రహించిన రామచంద్రాపురం మత్స్యకారులు తమిళనాడుకు చెందిన మత్స్యకార బోట్లను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై చర్చలు జరిగాయి.

ఈ నేపథ్యంలో ఇటువంటి గొడవలు జరగకుండా శాశ్వత పరిష్కారం చూపాలని ఎమ్మెల్యేను, అధికారు లను కోరారు. అనంతరం ఇరు రాష్ట్రాలకు చెందిన మత్స్య శాఖ అధికారులు హద్దులు దాటి రాకుండా చేపలవేట చేసుకునేలా ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసుకున్నారు.

కార్య క్రమంలో మత్స్యశాఖ జేడీ సాల్మన్‌రాజు, తమిళనాడు మత్స్య శాఖ ఏడీ శివకుమార్, మత్స్యశాఖ సబ్ ఇన్‌స్పెక్టర్ ఫసరుల్ అహ్మద్, చెన్నై బోట్ ఓనర్స్ అసోషియోషన్ అధ్యక్షుడు కుప్పన్, తహశీల్దారు బాలమురళి, తెదేపా మండలాధ్యక్షుడు వంశీక ృషా?రెడ్డి, రామతీర్థం, గాదెలదిన్ని సర్పంచులు, యంపీటీసీ సభ్యుడు మురళీరెడ్డి, యంపీడీఓ విజయ కుమార్ పాల్గొన్నారు.

# ప్రగతిపథంలో సహకార కేంద్రబ్యాంకు



కర్నూలు : జిల్లా సహకార కేంద్రబ్యాంకు ప్రగతి పథంలో ఉందని.. నష్టాల నుంచి గట్టెక్కి లాభాల బాటలో సాగుతోందని, అడిగిన ప్రతి రైతుకు రుణం మంజూరు చేస్తామని కేడీసీసీబీ ఛైర్మన్ ఎం.మల్లికార్జునరెడ్డి అన్నారు. సోమవారం డీసీసీబీలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఈవో రామాంజనేయులుతో కలిసి 2016-17 ఆర్థిక సంవత్సరం లావాదేవీలు, 2017-18 రుణ లక్ష్యాలను వెల్లడించారు. గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆడిట్ జూన్ 30వ తేదీకి ముగిసిందని, రాష్ట్రంలో ఆడిట్ పూర్తయిన మొదటి బ్యాంకు తమదేనని ఆయన వెల్లడించారు. గత ఆర్థిక సంవత్సరం స్థూల లాభం రూ.3.50 కోట్లు ఉండగా పన్నులు పోను రూ.2.02 కోట్ల లాభాలు వచ్చాయన్నారు. రూ.16.81 కోట్ల నష్టాలు ఉండగా రూ.14.78 కోట్లకు, బ్యాంకు నిరర్థక ఆస్తులను 4.96 శాతానికి తగ్గించగా, 9 శాతం ఉండాల్సిన సీఆర్ఏఆర్ 9.61 శాతానికి తెచ్చామన్నారు. 2015-16లో రూ.1040 కోట్లు ఉన్న టర్నోవర్ రూ.1340 కోట్లకు పెరిగిందన్నారు. రుణాల రికవరీలో 83 శాతంతో రాష్ట్రంలో ద్వితీయ స్థానంలో ఉన్నామన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి దీరికాలిక రుణాల కింద రూ.56 కోట్లు సంఘాలకు మంజూరు చేశామన్నారు. ప్రతి సంఘానికి రూ.80 లక్షలు ఇచ్చామన్నారు. ఇందులో రూ.10 లక్షలు డ్కెరీలకు, రూ.50 లక్షలు హార్టికల్చర్‌కు, రూ.20 లక్షలు ట్రాక్టర్లకు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ ఖరీఫ్‌కు రైతునేస్తం, కర్షకజ్యోతి, క్రాఫ్ రుణాలు మొత్తం రూ.200 కోట్ల వరకు రుణాలు ఇవ్వనున్నట్లు చెప్పారు. రైతులు ప్రధానమంత్రి పసల్ బీమా యోజన కింద ప్రమాద బీమాకు ప్రీమియం చెల్లించాలన్నారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంక్, దాని శాఖల్లో ఖాళీగా ఉన్న 62 స్టాఫ్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి వారంలోగా ప్రకటన ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. నియామక ప్రక్రియ అంతా ఆన్‌లైన్‌లోనే జరుగుతుందన్నారు. ముంబై ఐబీపీఎస్ వారు నియామక ప్రక్రియను నిర్వహిస్తారన్నారు. అనంతరం పాముకాటుతో ప్రమాదవశాత్తు మ ృతిచెందిన బండిఆత్మకూరు మండలం పరమటూరు గ్రామానికి చెందిన నాగపుల్లయ్య భార్య శివలక్ష్మమ్మకు రూ.లక్ష ప్రమాద బీమా అందజేశారు.

# చేనేత రంగాన్ని ఆదుకోవాలి



కర్నూలు : చేనేత రంగాన్ని ఆదుకోవాల్సిన ప్రభుతం దానిని నిర్వీర్యం చేసేందుకు కంకణం కట్టుకున్నట్టుగా పన్నుల మోత మోగిస్తోందని, కార్మికుల పరిస్థితి దయనీయంగా మారుతోందని చేనేత కార్మిక సంఘం ఆందోళన వ్యక్తం చేసింది. చేనేతపై విధించిన 23 శాతం అదనపు పన్ను భారం రద్దు చేయాలని డిమాండు చేస్తూ కలెక్టరేట్‌లోని చేనేత భవన్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సమావేశంలో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ, జిల్లా కార్యదర్శి జెఎన్ శేషయ్య, నేతాంజలి జిల్లా అధ్యక్షులు డాక్టర్ సింగరి సంజీవకుమార్, నక్కలమిట్ట శ్రీనివాసులుతోపాటు వివిధ సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. వ్యవసాయం తరువాత అధికంగా ఆధారపడిన చేనేత రంగాన్ని ఆదుకోకపోగా.. ప్రభుత్వం అధిక పన్నులో కార్మికుల నడ్డివిరుస్తోందని రాష్ట్ర నేత బాలక ృష? ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 12 లక్షల మంది పన్ను భారంతో ఆకలితో అలమటించే దుస్థితి నెలకొంటోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని నూలుపై 5 శాతం, చేనేత వస్త్రాలపై 18 శాతం పన్నును రద్దు చేయాలని కోరారు. డా.సంజీవకుమార్ మాట్లాడుతూ సంక్షోభంలో ఉన్న చేనేత రంగాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, విద్యుత్తు మగ్గాలతో కార్మికులు పోటీ పడలేరన్నారు. ప్రతి చేనేత కుటుంబానికి నెలకు రూ.2 వేల నగదును పదేళ్లపాటు అందచేయాలని, జియో ట్యాగింగ్ ద్వారా ఈ విధానం అమలు చేయాలని కోరారు. బీసీ సంక్షేమ సంఘం కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు మాట్లాడుతూ చేనేత కుటుంబాలకు న్యాయం చేసేందుకు అన్ని సంఘాలు ఏకంగా కదలిరావాలని కోరారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, వస్త్ర వ్యాపారుల సంఘం అధ్యక్షులు జి.ప్రసాద్, విశ్రాంత తహసీల్దార్లు అజయ్ కుమార్, రోశన్ అలీ ప్రసంగించారు. ప్రపంచ చేనేత దినోత్సవం సందర్భంగా ఆగస్టు 7 తేదీన కర్నూలులో తొలిసారిగా చేనేత మహాసభ నిర్వహిస్తున్నట్టు డా.సంజీవ కుమార్ తెలిపారు.

## 20లోగా తెదేపా అనుబంధ కమిటీల ఎంపిక

**- పది నుంచి కార్యకర్తలకు శిక్షణ**

**- సెప్టెంబరు, అక్టోబరులో ఇంటింటికి తెదేపా**

ఒంగోలు : జిల్లా తెలుగుదేశం పార్టీ అనుబంధ సంస్థల ఎంపిక ఈ నెల 20లోగా పూర్తవుతుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తెలిపారు. పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్వహించిన వీడియో సమావేశం గురించి ప్రస్తావించారు. ఈ నెల 20వతేదీలోగా మండల కమిటీలు, అనుబంధ సంస్థల ఎంపిక పూర్తవుతుందని.. జిల్లా కమిటీని కూడా ఎంపిక చేస్తామన్నారు. ప్రజాదరణ లేని నాయకులకు పదవులు ఇవ్వవద్దని ముఖ్యమంత్రి స్పష్టం చేశారన్నారు. రెండేళ్లలో ఎన్నికలు జరగనున్నందున ప్రతి వంద మంది ఓటర్లకు ఒక ముఖ్యకార్యకర్తను ఎంపిక చేసి.. వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు. త్వరలో ఎంపీ, ఎమ్మెల్యేలతోపాటు మొత్తం 250 మంది ముఖ్య నాయకులకు ఈ నెల పదో తేదీ నుంచి కందుకూరు శిక్షణ తరగతులు ప్రారంభ మవుతాయన్నారు. సెప్టెంబరు, అక్టో బరులో ఇంటింటికి తెలుగుదేశం కార్య క్రమం జరుగుతుందన్నారు. మంగళవారం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలకు విజయవాడలో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారని అన్నారు. రాష్ట్రపతి అభ్యర్థి పరిచయ కార్యక్రమం జరుగుతుందన్నారు.

## 'ఐక్యంగా ముందుకెళ్లాలి'

శ్రీహరికోట : ఎస్సీ, ఎస్టీ కులాల వారందరూ ఐక్యంగా ఉండి సమస్యలపై పోరాటం చేయాలని కారెం శివాజీ పేర్కొన్నారు. ఆయన సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ షార్(శ్రీహరికోట)కు వచ్చారు. ఈ సందర్భంగా షార్‌లోని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం నాయకులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ సమస్యలపై నిరంతరం పోరాటం చేయాలని చెప్పారు.

విజయభాను

సంపాదకీయం

# చారిత్రాత్మకమైన నిర్ణయం

చాలా ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్న వస్తుసేవల పన్ను (గూడ్స్ అండ్ సర్వీసెస్ టాక్స్-జీఎస్టీ) జూలై నెల ఆరంభం నుంచి దేశంలో అమలులోకి వచ్చింది. దీంతో ఈ ఉపఖండంలో ఆర్థికాభివృద్ధి పుంజుకొని స్థూలంగా దేశ ఆర్థిక వ్యవస్థ మెరుగుపడుతుందని ఆశించవచ్చు. స్వాతంత్ర్యం తర్వాత అతి పెద్ద పన్ను సంస్కరణగా దీన్ని భావించవచ్చు. జీఎస్టీతో దేశంలో ఒకే పన్ను విధానం అమలులోకి వచ్చి అటు రాష్ట్రాలు, దేశం కూడా ఆర్థికంగా లాభపడుతాయి.

జీఎస్టీతో ఎలా, ఏం లాభమంటే.. మార్కెట్ ఆర్థికవేత్తలు ఆడమ్ స్మిత్, రికార్డో చెప్పిన విధంగా నియంత్రణలేని వ్యాపారమే దేశాన్ని ఐశ్వర్యవంతం చేస్తుంది. స్వేచ్ఛాయుత వ్యాపార విధానం ఎంత విస్తృతంగా ఆచరణలో ఉంటే అంతగా ఆ సమాజం ఆర్థికాభివృద్ధి చెందుతుందని వారు ఏనాడో సెలవిచ్చారు. ఇన్నాళ్లకు వారి బాటలో నడుస్తున్నాం. దేశమంతా ఏకరీతి పన్ను విధానంతో స్వేచ్ఛాయుత వ్యాపారానికి జీఎస్టీతో మార్గం సుగమమై దేశాభివృద్ధి గతం కన్నా వేగంగా పరుగులు తీస్తుంది. భారతీయుల ఆశలు, ఆకాంక్షలు నెరవేరాలంటే జీఎస్టీతోనే సాధ్యం. జీఎస్టీ విధానం తీసుకురావాలన్న 17 ఏళ్ల తర్వాత ఈ జూలై మధ్య రాత్రి నుంచి అమల్లోకి వచ్చింది. ఇప్పటిదాకా పరోక్ష పన్నుల విధానంతో ఎన్నో అవాంతరాలు ఎదుర్కొన్నాం. జీఎస్టీతో ఇక అలాంటి అవాంతరాలేవీ ఉండవు. కోట్లాది మంది వ్యాపారస్తులు, వేలకోట్ల ఆర్థిక వ్యవస్థ అంతా ఒకే మార్కెట్‌గా అవతరించింది. జీఎస్టీతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధిస్తున్న డజన్‌కు పైగా వివిధరకాల పన్నులు పోయి ఒకే పన్ను ఉంటుంది. దేశమంతా ఒకే రీతిగా అమలులోకి వస్తుంది. దీంతో ఆసియాలో మూడో అతిపెద్ద మార్కెట్‌గా దేశం అవతరిస్తుంది. గాంధీ.. స్థానిక ఉత్పత్తి వినియోగం ద్వారానే ప్రజలు ఆర్థికాభివృద్ధి, స్వావలంబన సాధిస్తారని భావించాడు. ఈ భావన పునాదిపైన చెప్పిందే రాట్నం పై చేతితో నూలు వడకటం. దీంతో పెద్ద స్థాయిలో ఉత్పత్తి పెంచటానికీ, పరిశ్రమల స్థాపనకు దూరంగా ఉన్నది. ఇది ఒకరకంగా ఆలోచిస్తే, ఆధ్యాత్మిక ఆలోచనలకు దగ్గరగా ఉన్నట్లు కనిపిస్తుంది. కాబట్టి ఉత్పత్తి పెరుగటానికి, సంపద పెరుగ టానికి గాంధీ ఆలోచనా విధానం అనుగుణంగా లేదు. దీంతో పేదరికం ఒక అనివార్య స్థితిలో భాగంగానే ఉండిపోయింది. అ క్రమంలోనే వ్యవసాయోత్పత్తి కూడా అలాగే ఉండిపోయి వ్యవసాయోత్పత్తులు అవసరాలకు అనుగుణంగా పెరుగక పోవటంతో కరువు కాటకాలు తాండవించాయి. ఆధ్యాత్మిక ఆలోచన, ఆచరణ దేశ ప్రజలను ఆకలిచావుల నుంచి దూరం చేయలేక పోయిందన్నది చారిత్రక వాస్తవం.

ఆడమ్ స్మిత్ చెప్పినట్లు, రికార్డో మెరుగులు దిద్దినట్లు.. శ్రమ విభజన, విభజిత ప్రత్యేక నైపుణ్యాలతోనే సంపద సృష్టించబడుతుంది. ఈ విధమైన వ్యాపార వ్యవస్థతోనే ఉత్పత్తి కూడా పెరిగి సంపద పంచబడుతుంది. పేదరికం దూరమవుతుంది. ఎంతగా పని విభజన జరిగి ప్రత్యేక నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయో అంతగా ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుంది. ప్రజలు ధనవంతులవుతారు. జీఎస్టీ అమలులోకి రానంతకాలం స్వేచ్ఛా మార్కెట్‌కు అనేక అవరోధాలున్నాయి. రాష్ట్రాల సరిహద్దులే మార్కెట్‌కు ఆటంకాలుగా మారి స్వేచ్ఛా మార్కెట్ రూపాం దలేదు. మార్కెట్ మొత్తం చిన్నచిన్న సరిహద్దుల్లోపల కునారిల్లిపోయి ఆర్థిక వ్యవస్థ కుంటుపడిపోయింది. ప్రజలు, దేశం పేద దేశంగా మిగిలిపోయింది. ఈ నేపథ్యంలోనే.. జూన్ 30 మధ్య రాత్రి పార్లమెంట్ సెం ట్రల్ హాల్లో జీఎస్టీ బిల్లు చట్ట రూపం ధరించి అమల్లోకి వచ్చింది. దీనికి దేశవ్యాప్తంగా అన్ని రాజకీయ పార్టీల నేతలు, అమితాబ్ బచ్చన్, రతన్ టాటా లాంటి ప్రముఖుల సమక్షంలో జీఎస్టీ ప్రాణం పోసుకున్నది. పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో గతంలో 1997లో మధ్యరాత్రి ఒక ఉత్స వం జరిగింది. అది దేశ స్వాతంత్ర్య గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు జరిగాయి. తర్వాత మళ్లీ ఇప్పుడే అంతటి ప్రాధాన్యమున్న జీఎస్టీ ప్రారంభోత్సవం చోటు చేసుకున్నది. ఇంతటి ప్రాధాన్యమున్న జీఎస్టీతో దేశ ఆర్థికాభివృద్ధికి ఎంతో మేలు జరుగుతుంది.

జీఎస్టీని ఆలస్యంగానైనా అమల్లోకి తెచ్చుకోవటం మన దేశాభివృద్ధికి ఎంతో దోహదం చేస్తుంది. ఈ సందర్భంగానే ఐఎంఎఫ్ అభిప్రాయం పరిగణించదగింది. ప్రభుత్వం ప్రధానమైన చారిత్రాత్మకమైన నిర్ణయం తీసుకున్నది. దీంతో దేశం సుస్థిరాభివృద్ధి చెందుతుంది అని ఐఎంఎఫ్ మేనేజింగ్ డైరెక్టర్ టావో ఝూంగ్ అన్నారు. అలాగే.. జీఎస్టీ ప్రారంభంతో దేశాభివృద్ధి పుంజుకొని 8 పైగా వృద్ధిరేటు దాటుతుంది. దేశ వ్యాప్తంగా జీఎస్టీ అమలుతో ఉత్పత్తిలో గుణాత్మక మార్పు వచ్చి ఉత్పత్తి పెరుగుతుందని కూడా ఐఎంఎఫ్ తెలిపింది.

# దూసుకొచ్చిన చైనా యుద్ధనౌకలు

## హిందూ మహా సముద్రంలో చక్కర్లు



న్యూఢిల్లీ: ఒకవైపు సరిహద్దుల్లో భారత్-చైనా సైనికుల మధ్య ఘర్షణాత్మక వాతావరణం.. మరోవైపు భారత్-చైనా మధ్య మాటల యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో చైనా యుద్ధనౌకలు హిందూ మహాసముద్రంలో చక్కర్లు కొడుతుండటం కలకలం రేపుతోంది. చైనీస్ యుద్ధనౌకలు అనూహ్యరీతిలో భారత్‌కు ఆనుకొని ఉన్న హిందూమహాసముద్రంలో సంచరిస్తుండటం గమనార్హం. సిక్కిం సరిహద్దుల్లో నెలరోజులుగా ఇరుదేశాల ఆర్మీ మధ్య ఘర్షణలతో పరిస్థితి ఉద్రిక్తంగా మారిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలతో ఇప్పుడున్న భారత్ 1962నాటి భారత్ కాదంటూ రక్షణమంత్రి జైట్లీ వ్యాఖ్యానించగా.. ఆయన ప్రకటనపై చైనా స్పందించింది. జైట్లీ సరిగ్గానే చెప్పారు. 1962 కన్నా 2017నాటి భారతం భిన్నంగా ఉంది. ప్రస్తుత చైనా కూడా అప్పటి చైనా కాదనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి అని చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి గెంగ్ షువాంగ్ సోమవారం హెచ్చరించారు.

1890 నాటి చైనా బ్రిటిష్ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ భారత ఆర్మీ మోసం చేస్తోందని, నిబంధనలకు విరుద్ధంగా తమ భూభాగంలోకి సైన్యం చొచ్చుకొచ్చిందని ఆయన ఆరోపించారు. వెంటనే భారత బలగాలను వెనక్కు తీసుకోవాలని, లేని పక్షంలో భౌగోళిక సార్వభౌమత్వాన్ని కాపాడుకునేందుకు చైనా అన్ని అత్యవసర చర్యలు చేపడుతుందని పరోక్షంగా యుద్ధానికైనా సిద్ధమనే సంకేతాలిచ్చారు. సిక్కిం ప్రాంతంలో భారత్-చైనా దేశాల మధ్య సరిహద్దులు ముందుగా నిర్ణయించినట్లుగానే ఉన్నాయన్నారు. మా భూభాగంలోకి ప్రవేశించటం, మా సైనికుల కార్యక్రమాలకు అడ్డుతగలటం ద్వారా అంతర్జాతీయ సరిహద్దు నిబంధనలను భారత్ ఉల్లంఘిస్తోంది. సరిహద్దుల్లో శాంతికి ఆటంకం కలిగిస్తోంది. వెంటనే భారత ఆర్మీ వెనక్కు వెళ్లిపోవాలి అని గెంగ్ అన్నారు.

సిక్కింపై 1890 నాటి చైనాబ్రిటిష్ ఒప్పందాన్ని తొలి భారత ప్రధాని నెహ్రూ 1959లో నాటి చైనా ప్రధాని చౌ ఎన్‌లైకి రాసిన లేఖలో ఆమోదించారు. తర్వాతి భారత ప్రధానులందరూ దీన్ని గౌరవిస్తూనే వచ్చారు. కానీ ఈ మధ్య సిక్కిం సరిహద్దుల్లో భారత్ తీసుకున్న చర్య మోసపూరితం. డోకా లా చైనాకు సంబంధించిన ప్రాంతం. అందుకే భారత్ వెనక్కు వెళ్లిపోవాలి అని గెంగ్ హెచ్చరిక స్వరంతో తెలిపారు. అయితే దౌత్యపరంగా ఈ సమస్యను పరిష్కరించుకునేందుకు ద్వారాలు తెరిచే ఉన్నాయన్నారు. భూటాన్‌ను భారత్ రక్షణ కవచంలా వినియోగించుకుంటోందని గెంగ్ ఆరోపించారు. అవసరమైతే భూటాన్ అంతర్గత వ్యవహారాల్లో ఇతరుల (భారత్) జోక్యం లేకుండా ఉండేందుకు తాము పూర్తిగా సహకరిస్తామని గెంగ్ తెలిపారు. చైనాతో ఎటువంటి దౌత్యపరమైన సంబంధాల్లేని భూటాన్‌కు మిలటరీ పరంగా, దౌత్యపరంగా భారత్ రక్షణ పూర్తి మద్దతిస్తున్న విషయం తెలిసిందే. దక్షిణ టిబెట్ ప్రాంతమైన చుంబీ లోయపై ఆధిపత్యం ప్రదర్శించటం ద్వారా భారతభూటాన్ సరిహద్దుల్లో జరిగే కార్యకలాపాలపై దృష్టిపెట్టాలని చైనా ప్రయత్నిస్తోందని రక్షణరంగ నిపుణులు భావిస్తున్నారు.

# అక్రమ జువెల్లరీ అమ్మకాలకు జీఎస్టీ ఊతం



ముంబై : బంగారం అమ్మకాలపై పన్ను రేట్ల పెంపుపై ఆందోళన వ్యక్తమవుతున్నాయి. ఈ రేట్ల పెంపుతో అక్రమ ఆభరణాల అమ్మకానికి ఎక్కువగా దారితీసే అవకాశ ముందని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. జూలై 1 నుంచి దేశవ్యాప్తంగా కొత్త పన్ను విధానం జీఎస్టీ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో బంగారంపై జీఎస్టీ పన్ను రేట్లు కూడా అంతకముందు కంటే పెరిగాయి. ముందస్తు 1.2 శాతంగా ఉన్న బంగారంపై పన్ను రేట్లు, ప్రస్తుతం 3 శాతానికి ఎగిశాయి. దీంతో బ్లాక్ మార్కెట్ ఎక్కువగా విజృంభించే అవకాశముందని తెలుస్తోంది.

మూడు శాతం పన్ను చాలా ఎక్కువ. ఎలాంటి రశీదులు లేకుండా కొనుగోలుకు మేము సిద్ధం. జువెల్లర్‌కు ఎలాంటి సమస్య ఉండదు'' అని ఓ కొనుగోలదారుడు తన అభిప్రాయం వ్యక్తంచేశారు. దేశంలో అతిపెద్ద బులియన్ మార్కెట్ ముంబైలోని జవేరి బజార్‌కు చెందిన ఈ కొనుగోలుదారుడు పేరు చెప్పడానికి నిరాకరించాడు. పన్ను రేట్లు పెరగడంతో చాలా దుకాణాలు రశీదులు లేకుండా విక్రయాలు చేపడతాయని జేజే గోల్డ్ హౌజ్ ప్రొప్రైటర్ హర్షద్ అజ్మేరి కూడా చెప్పారు. కేవలం 1 శాతం కొనుగోలుకే కొంతమంది కస్టమర్లు రశీదులు లేకుండా కొనుగోళ్లు చేపట్టేవారు, కానీ ప్రస్తుతం 3 శాతం జీఎస్టీతో చిన్న జువెల్లరీలు కచ్చితంగా అనధికారిక విక్రయాలు చేపడతారని అజ్మేరీ పేర్కొన్నారు. ఈ పన్ను రేట్లు పెంపు గోల్డ్ స్మగ్లింగ్‌కు ఎక్కువగా దారితీస్తుందన్నారు.

ప్రపంచవ్యాప్తంగా భారత్ రెండో అతిపెద్ద బంగారం వినియోగదారునిగా ఉంది. మెటల్స్‌పై దిగుమతి సుంకాలను 10 శాతానికి పెంచినప్పటి నుంచి గోల్డ్ స్మగ్లింగ్ ఎక్కువగా పెరిగింది. 2016లో 120 టన్నులకు పైగా బంగారం స్మగ్లింగ్ నెట్‌వర్క్‌ల ద్వారా భారత్‌లోకి ప్రవేశించిందని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ అంచనావేసింది. ఇది ఇప్పుడు మరింత పెరిగే అవకాశముందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

స్మగ్లింగ్ చేసే బంగారానికి జీఎస్టీ ప్రోత్సాహకంగా ఉందని, ప్రభుత్వం దిగుమతి సుంకాన్ని తగ్గించి, స్మగ్లింగ్‌కు అవకాశం లేకుండా చేయాలని ముంబైకు చెందిన ఓ జువెల్లరీ సూచించారు. తక్కువ దిగుమతి సుంకం, అధికారిక దిగుమతులను ప్రోత్సహించి, చట్టపరమైన విక్రయాలకు దోహదం చేస్తుందని హోల్‌సేలర్ ఎంఎన్‌సీ బులియన్ డైరెక్టర్ దమన్ ప్రకాశ్ రాథోడ్ కూడా చెప్పారు. ఏడాదిలో అధికారికంగా జరిగే దిగుమతులు 800 టన్నులుంటున్నాయి.

# డ్రగ్స్ రాకెట్: మరో నలుగురి అరెస్ట్

హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన హైదరాబాద్ డ్రగ్స్ దందా కేసు దర్యాప్తును ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వేగమంతం చేశారు. ఈ కేసుకు సంబంధించి మరో నలుగురిని అరెస్ట్ చేశారు. నగరంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఈ అరెస్టులు జరిగినట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తెలిపారు. నేడు తమ తనిఖీలలో పట్టుబడ్డ నలుగురు వ్యక్తులు ఎంఎన్‌సీ కంపెనీ (సాఫ్ట్‌వేర్) ఉద్యోగులేనని చెప్పారు. ఇప్పటివరకూ 100 ఎల్‌ఎస్‌డీలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ డ్రగ్స్ కేసులో ఇప్పటివరకూ ఓవరాల్‌గా ఏడుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. డ్రగ్స్ మాఫియా కేసును పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. ఇదివరకే హైదరాబాద్‌లో పలు ఇంటర్నేషనల్ స్కూళ్లు, ఎనిమిది ఇంజనీరింగ్ కాలేజీలకు నోటీసులకు జారీ చేసి డ్రగ్స్‌కు బానిసైన కొందరు విద్యార్థులను ప్రశ్నించారు. డ్రగ్స్ కేసులో ఆరోపణలెదుర్కొంటున్న బడా నిర్మాతతోపాటు దర్శకుడిని నేడు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విచారించే అవకాశాలున్నాయి. ఇందుకోసం ముందుగానే మాదాపూర్‌లోని ఆరు ఎంఎన్‌సీ కంపెనీలు, నగరంలోని 8 స్టార్ హోటళ్లకు చెందిన ప్రతినిధులను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విచారిస్తున్నట్లు సమాచారం. ఈ కేసు విచారణకు ఇప్పటికే ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ఏర్పాటైన విషయం తెలిసిందే.

కవి సమయం

## కర్మ ప్రారబ్ధం

ఆరతార మూర్తులకు సైతం
కర్మ ప్రారబ్ధం తప్పదు
సంచిత, పురాకృత కర్మల
ఫలితం తప్పించుకొనుట అసాధ్యం
సుఖదుఃఖముల యందు సమదృష్టి
సర్వజీవ, సర్వమానవ సమానత్వ భావన
శృతి మించిన రాగద్వేషాదులు త్యజించుట
మన జీవన ప్రథమ కర్తవ్యం
సాదభావన, కర్మఫలములు త్యజించుట
తామరాకు పై నీటిబొట్టు జీవనం
ఈశ్వరార్పణ బుద్ధితో కర్మాచరణ
జనుల సేవతో జీవితాన్ని గడపడమే
జనార్ధనుని సేవ అన్నది ఆర్యక్తి

...కవితా రచన
సి.ప్రతాప్
సెల్ నెం: 90636 22665

# పంచాంగం

మాసం : ఆషాడం; తిథి: ద్వాదశి రా.2.43; విశాఖ ఉ.06-28; వ.ఉ.10-53 ల 12.39.

బుధవారం 05-07-2017

**మేషం** : విద్యార్థులకు దూర ప్రాంతాల్లో ఉన్నత విద్యావకాశాలు లభిస్తాయి. నిరుద్యోగులు భేషజాలకు పోకుండా ఏ చిన్న అవకాశం దొరికినా సద్వినియోగం చేసుకోవటం మంచిది. వృత్తుల వారికి అన్ని విధాలా కలిసిరాగలదు. పాతమిత్రుల కలయిక కొత్త అనుభూతినిస్తుంది.

**వృషభం** : వైద్యులకు శస్త్రచికిత్స చేయునపుడు మెళుకువ అవసరం. ధన వ్యయం, చెల్లింపులలో మెలకువ వహించండి. కాంట్రాక్టర్లు, బిల్డర్లకు నిర్మాణ పనులలో ఊహించని చికాకు లెదుర్కోవలసి వస్తుంది. సాంస్కృతిక, సేవా కార్యక్రమాల్లో చురుకుగా వ్యవహరిస్తారు. పెద్దల ఆరోగ్య, ఆహార విషయాల్లో మెళకువ అవసరం.

**మిథునం** : ఆకస్మికంగా ప్రయాణాలు వాయిదాపడతాయి. స్త్రీలకు ఆరోగ్య విషయంలో తగు జాగ్రత్తలు అవసరం. భాగస్వామికుల మధ్య కొత్త విష యాలు చర్చకు వస్తాయి. లీజు, ఏజెన్సీలు, నూతన కాంట్రాక్టులు అనుకూలిస్తాయి. విద్యార్థి నులకు ప్రేమ వ్యవహారాల్లో భంగపాటు తప్పదు. మిత్రులను కలుసుకుంటారు.

**కర్కాటకం** : రియల్ ఎస్టేట్ రంగాల వారికి ఊహించని చికాకులు ఎదురవుతాయి. గతంలో నిలిపివేసిన పనులు పునఃప్రారంభిస్తారు. ఖర్చులు పెరిగినా ప్రయోజనకరంగా ఉంటాయి. కోర్టు వ్యవహారాలు, ఆస్తి పంప కాలు ఒక కొలిక్కి వస్తాయి. వ్యాపారాల్లో పెరిగిన పోటీని తట్టుకోవటానికి బాగా శ్రమించాలి. ఆలయాలను సందర్శిస్తారు.

**సింహం** : సాంఘిక, సాంస్కృతిక, సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. ప్రభుత్వ కార్యాలయాల్లో మీ పనుల సాను కూలతకు పలుమార్లు తిరగవలసి ఉంటుంది. బ్యాంకు నుంచి పెద్దమొత్తంలో నగదు డ్రా చేసే విషయంలో జాగ్రత్త అవసరం. పాత వస్తువులను కొంటే ఇబ్బందులు తప్పవు.

**కన్య** : రాజకీయ నాయకులు సభలు, సమావేశాలలో హుందాగా వ్యవహరించి అందరినీ ఆకట్టుకుంటారు. మీ సమర్థతపై ఎదుటివారికి విశ్వాసం ఏర్పడుతుంది. కొబ్బరి, పండ్ల, పూల, కూరగాయల వ్యాపారులకు సంతృప్తి, పురోభివృద్ధి. దుబారా ఖర్చులు అధికం.

**తుల** : రావలసిన ధనం చేతికందడంతో రుణం తీర్చాలనే మీ యత్నం నెరవేరుతుంది. స్త్రీల పట్టుదల వల్ల కుటుంబ సౌఖ్యం అంతగా ఉండదు. దంపతుల మధ్య అన్యోన్యత నెలకొంటుంది. హోటల్, కేటరింగ్ రంగాల్లో వారు పనివారితో ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఒకానొక సందర్భంలో మిత్రుల తీరు నిరుత్సాహం కలిగిస్తుంది.

**వృశ్చికం** :నిత్యావసర వస్తు వ్యాపారులకు స్టాకిస్టులకు పురోభివృద్ధి. బంధువుల రాక వల్ల మీరు కొంత అసౌకర్యానికి లోనవుతారు. దైవ సేవా కార్యక్రమంలో చురుకుగా పాల్గొంటారు. కోర్టు వ్యవ హారాలు కొత్త మలుపు తిరుగుతాయి. మీ మాటే నెగ్గాలన్న పంతం విడ నాడండి.

**ధనుస్సు** : స్త్రీలు కుటుంబ పరిస్థితులతో సర్దుకుపోవడం క్షేమ దాయకం. నూతన పరిచయాలు మీ పురోభివృద్ధికి నాంది పలుకుతాయి. ధనం ఏ కొంతైనా నిల్వ చేయటం వల్ల సంతృప్తి కానవస్తుంది. ధనం ఏ కొంతైనా నిల్వ చేయటం వల్ల సంతృప్తి కానవస్తుంది. ఉపాధ్యాయులు విశ్రాంతికై చేయు యత్నాలు వాయిదా పడ తాయి.


**మకరం** :మనశ్శాంతి కోసం కొన్ని విషయాల్లో సర్దుకు పోవటం క్షేమదాయకం. మీ సంతానం అత్యుత్సాహాన్ని అదుపులో ఉంచటం మంచిది. స్త్రీలకు పనివారితో ఒత్తిడి, చికాకులు తప్పవు.

**కుంభం** : మీ ఏమరుపాటుతనం వల్ల పత్రాలు విలువైన వస్తువులు చేజారిపోయే ఆస్కారం ఉంది. రాజకీయాలలో వారికి ప్రత్యర్థులు పెరుగుతున్నారు అని గమనించండి. ప్రముఖుల కలయికతో పనులు సానుకూలమవుతాయి.

**మీనం** : ఉపాధ్యా యులకు అదనపు బాధ్యతలు, పనిభారం వంటి చికాకులు తప్పవు. స్త్రీలపై శకునాలు, చుట్టుపక్కల వారి వ్యాఖ్యలు తీవ్ర ప్రభావం చూపుతాయి. కాంట్రాక్టర్లకు రావలసిన బిల్లుల వసూలులో ప్రయాసలను ఎదుర్కొంటారు.

# అక్షింతల పరమార్థం తెలుసుకుందాం...

సంకీర్తన



### చంద్రుడికి ప్రీతిపాత్రం

నవగ్రహాల్లో ఒక్కో గ్రహానికి ఒక్కో ధాన్యాన్ని దానవస్తువుగా పేర్కొంటారు. ఆ రకంగా నవగ్రహాలలో చంద్రుడికి ప్రీతి కరమైన దానవస్తువు బియ్యం. జ్యోతిషశాస్త్రం ప్రకారం చంద్రుడు మనస్సుకు అధినాయకుడు. మనిషి మనసు, బుద్ధి, గుణము, తల్లి, వ్యసనము ఇత్యాదులన్నీ చంద్ర కారకాలే అని అన్నారు పెద్దలు. అందుకే మనిషిపై చంద్రుడి ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఆ చంద్రుడికి సంకేతమైన బియ్యం కూడా మనిషి మనస్సుపై ప్రభావం చూపుతుంది. మనోధర్మాన్ని నియంత్రిస్తాయి.

### దీవెన పరమార్థం

శాస్త్రీయంగా చూస్తే, మనిషి దేహం ఓ విద్యుత్ కేంద్రం. విద్యుత్ సరఫరాల్లో హెచ్చుతగ్గులు సాధారణం. ఈ వ్యత్యాసాలు మనిషి మనస్సు మీద, ఆరోగ్యం మీద ప్రభావాన్ని చూపుతాయి. మనుషుల్లో తమో, రజో, సాత్త్వికాలనే త్రిగుణాలకూ కారకము. పెద్దలు వధూవరులపై అక్షతలు చల్లి ఆశీర్వదించే సమయంలో, దేహం లోని విద్యుత్తులో కొంత బాగం ఈ అక్షతలను తాకుతాయి. ఆశీస్సులు ఇచ్చే వాళ్ల నుంచి, పుచ్చుకొనే వాళ్ల కొంత విద్యుత్ బదిలీ అవుతుంది.

ఈ కారణంగా అక్షతల ద్వారా పెద్దలలో ఉండే సాత్విక గుణం పిన్నలకు లభిస్తుందనేది మన నమ్మకం.

పెద్దలు, విద్వాంసులు, గురువులు, తల్లి దండ్రులు, అత్తమామలు వివాహ సమయంలో, శుభకార్యాలలో మనకు అక్షతలు వేసి శిరస్సును తాకి ఆశీర్వదించడంలోని ఆంతర్యం, పరమార్థం ఇదే!

### జీవుడికి సంకేతం

మరో సిద్ధాంతం ప్రకారం చూస్తే మనిషి దేహంలో విద్యుత్ కేంద్రాలు ఇరవై నాలుగు ఉంటాయట. వాటిలో ప్రధానమైనది శిరస్సు. ఇది విద్యుదుత్పత్తి కేంద్రమే కాదు. విద్యుత్ ప్రసార కేంద్రం కూడా. తలపై అక్షింతలు వేయడం ద్వారా వాటిలోని విద్యుత్‌ను గ్రహించి దేహానికి ప్రసారం చేస్తుంది శిరస్సు.అది సరే కాని! అక్షతలుగా ఉపయోగించే బియ్యానికి పసుపు కుంకుమలు కలపడం ఎందుకు? ఆయుర్వేదం ప్రకారం, చర్మ సంబంధ రోగాల్ని అడ్డుకునే శక్తి పసుపుకు ఉంది. పసుపు నుంచి తయారయ్యే కుంకుమకూ ఈ శక్తి ఉంది. అక్షతలు వేసే వారికి ఎలాంటి రోగ సమస్యలున్నా, పుచ్చు కొనే వాళ్ళకి అవి సోకకుండా ఈ పసుపు కుంకుమలు నివారిస్తాయట. అంతేకాక పసుపు కుంకుమలు శుభానికి సంకేతాలు కూడా. ఆధ్యాత్మికంగా చెప్పాలంటే జీవుడికి సంకేతం బియ్యం.

### భగవద్గీతలో ప్రస్తావన

అన్నాద్భవన్తి భూతాని అని మూడవ అధ్యాయంలో శ్రీకృష్ణ పరమాత్ముడు చెప్పాడు. జీవులు అన్నం చేత పుడతారట. ఈ అన్నం తయారీకి మనం ఉపయోగించే ధాన్యం బియ్యం. భగవంతునిపై అక్షతలు వేసి నమస్కరించడం అంటే, జీవుడు ఈ అన్నంలో పుట్టీ, తిరిగి ఈ జీవుడిని భగవంతుడిలోకి చేర్చడమే. అక్షతలలో ఇంతటి పరమార్థం గోచరిస్తుంది.తెలుగులో ఈ అక్షతలని తలంబ్రాలు లేదా తలబ్రాలు అని కూడా అంటారు. తలను:తల యందు పోయబడే, ప్రాలు:బియ్యం అని అర్థం.

### ధాన్యలక్ష్మికి ఆహ్వానం

పూర్వం వధువు ధాన్యలక్ష్మిగా చెప్పబడింది. ఈ తలంబ్రాల కార్యక్రమంలో బియ్యానికి ఒక ప్రత్యేకత ఉంది. ఓ వధువా! నీవు మా ఇంటికి వచ్చాక, మన ఇంట ధాన్యం ఇలా కుప్పతెప్పలుగా విరివిగా ఉండి, మన జీవనానికి ఆధారభూతమైన ధాన్యంతో మనం నిత్య సంపదల వాళ్ళమై తులతూగుతూ ఉండాలి అనే భావానికి అనుగుణంగా ఈ తలంబ్రాల కార్యక్రమం సాగుతుంది.

### వివాహకర్మ పరమార్థం

వరుడు, వధువు శిరస్సులపై తలంబ్రాలు పోసుకొనే దానికి ముందు, వరుడు ముందుగా వధువు చేతిని దర్భతో తుడిచి, దోసిలిలో రెండు మార్లుగా బియ్యాన్ని వేసి, ఆ మీదట పాలని కొద్దిగా చల్లి తలంబ్రాలకి సిద్ధం చేస్తాడు. తలంబ్రాలు వేసాక వధువు ఇలా చెయ్యాలని ఒక పద్ధతి చెబుతుంది. ఈ కాలంలో పురోహితులే చేయించి పోయిస్తున్నారు.ఈ కన్య వంశాన్ని తరింపజేయుగాక పుణ్యం వృద్ధి చెందుగాక.

రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
విజయభాను క్లాసిఫైడ్స్
Minimum 7 days
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

## కష్టించేతత్వమే విజయ రహస్యం

బాపట్ల : క్రమశిక్షణ, కష్టించేతత్వమే విద్యార్థులను విజయతీరానికి చేరుస్తుందని జాతీయ వ్యవసాయ పరిశోధన, యాజమాన్య సంస్థ సంచాలకుడు సీహెచ్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. బాపట్ల వ్యవసాయ కళాశాలను ఆయన సోమవారం సందర్శించి బీవీ నాథ్ ఆడిటోరియంలో విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. తాను గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చానని, ఆంగ్ల మాధ్యమంలో చదవకపోయినా ఏజీ కళాశాలలో చేరిన తరవాత పట్టుదలతో కష్టపడి చదివి శాస్త్రవేత్తగా ఎదిగానన్నారు. వ్యవసాయ విద్య అభ్యసించే విద్యార్థులకు మంచి అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. పరిశోధన నైపుణ్యాలు పెంచుకొని, ఉత్తమ పరిశోధనలు చేసి రైతులకు మేలు చేయాలన్నారు. ఈ రంగంలో ఉన్న అపార అవకాశాలను అందిపుచ్చుకుని మంచి శాస్త్రవేత్తలుగా ఎదగాలని సూచించారు.

# బిందు, తుంపర్ల సేద్యాన్ని ప్రోత్సహించండి

## పాలనాధికారి పీఎస్ ప్రద్యుమ్న



చిత్తూరు : జిల్లాలో బిందు, తుంపర్ల సేద్యాన్ని ప్రోత్సహించాలని, ఈ మేరకు విస్తృతంగా ప్రచారం చేపట్టాలని పాలనాధికారి పీఎస్ ప్రద్యుమ్న ఆదేశించారు. జిల్లా సచివాలయంలో ఏపీఎంఐపీ అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. ఉద్యాన, వ్యవసాయ పంటల సాగులో సాగునీటి యాజమాన్యం ప్రధానమైంది. ప్రస్తుత పరిస్థితుల్లో అందుబాటులో ఉన్న నీటి వనరులను సద్వినియోగం చేసుకోవడానికి బిందు, తుంపర్ల సేద్యం అసలైన ప్రత్యామ్నాయ మార్గం. ప్రభుత్వం రైతులకు అనేక ప్రోత్సాహకాలు అందిస్తోంది. రాయితీ పథకాలు పొందడానికి అవసరమైన అర్హతలు, దరఖాస్తు చేసుకోనే విధానంపై రైతులకు అవగాహన కల్పించాలని పాలనాధికారి వెల్లడించారు. తదుపరి సూక్ష్మనీటిసాగు శాఖ ఆధ్వర్యంలో ముద్రించిన గోడపత్రికలు, కరపత్రాలను ఆవిష్కరించారు. జేసీ-2 చంద్రమౌళి, ఏపీఎంఐపీ పీడీ ధర్మజ తదితరులు పాల్గొన్నారు.

**ప్రభుత్వ పాఠశాలల్లో యోగా, ఆత్మరక్షణ పాఠాలు**

జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో యోగా, బాలికలకు ఆత్మరక్షణ పాఠాలను నిరంతరం కొనసాగించాలని విద్యా, సంక్షేమ శాఖల అధికారులను పాలనాధికారి ఆదేశించారు. జిల్లా సచివాలయంలో డీఈవో, సాంఘిక, మైనారిటీ సంక్షేమ శాఖల అధికారులతో సమీక్షించారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్తు, రెసిడెన్షియల్, గురుకుల, కేజీబీవీ ఉన్నత పాఠశాలల్లో వారానికి మూడ్రోజుల పాటు యోగా తరగతులు నిర్వహించాలని సూచించారు. దీంతోపాటు సర్కారు బడుల్లోని బాలికలకు ఆత్మరక్షణ పాఠాలు నేర్పించాలని కోరారు. 8, 9, 10వ తరగతి బాలికలకు కరాటే నేర్పించే ప్రక్రియ కొనసాగించాలని తెలిపారు.

డీఈవో శామ్యూల్, సాంఘిక సంక్షేమ శాఖ జేడీ విజయకుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావు, బీసీ సంక్షేమాధికారి శ్రీధర్‌రెడ్డి, మైనారిటీ సంక్షేమాధికారి ప్రభాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.జిల్లాలో పోస్ట్ మెట్రిక్, ప్రీ మెట్రిక్ ఉపకార వేతనాల మంజూరుకు కళాశాలలన్నీ జ్ఞానభూమి పోర్టల్ అంతర్జాలంలో రిజిస్ట్రరు చేసుకొనేలా చర్యలు తీసుకోవాలని పాలనాధికారి సూచించారు.

సంక్షేమ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. 2016-17 సంవత్సరంలో ఉపకార వేతనాల బకాయిలు, విడుదల కావాల్సిన నిధులు, 2017-18 సంవత్సరానికి అవసరమైన నిధులు, ఉపకార వేతనాల మంజూరు, కళాశాలల రిజిస్టర్ తదితర అంశాలపై సంక్షేమ శాఖల అధికారులతో సుదీర్ఘంగా సమీక్షించారు.పంట కుంటలు తవ్వుకొనేలా రైతులకు అవగాహన కల్పించాలని పాలనా ధికారి సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా సచివాలయంలో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. వ్యవసాయ, అనుబంధ శాఖలకు కేటాయించిన లక్ష్యాలు, సాధించిన ప్రగతిపై సమీక్షించారు.

# ముగిసిన మారు రథయాత్ర

విజయనగరం : గత నెల 25న ప్రారంభమైన జగన్నాథ రథోత్సవం ముగిసింది. ఇంద్రజమున మందిరాల్లో తొమ్మిది రోజుల పాటు కొలువై ఉన్న జగన్నాథుడు వివిధ రూపాల్లో భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు. విజయనగరం పట్టణంలోని సంతపేట, దాసన్నపేటల్లో నిర్వహించే ఈ రథోత్సవాలకు ఆయా ఆలయ కమిటీ, దేవాదాయశాఖ సంయుక్తంగా నిర్వహించాయి.

మారు రథయాత్ర అంగరంగ వైభ వంగా జరిగింది. ఉదయం 11 గంటలకే ఆయా ఇంద్రజమున మందిరాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు పూజలు నిర్వహించారు. అనంతరం రథంలో ప్రతిష్ఠించాక భక్తులు బారులు తీరి రథాన్ని అధిరోహించిన స్వామి వార్లను, అమ్మవారిని దర్శించి తరించారు. దాసన్నపేట నాలుగు రోడ్ల కూడలి, కన్యాకా పరమేశ్వరి ఆలయం కూడలి ప్రాంగణం అంతా భక్తజన సందోహంతో నిండిపోయింది. ఉత్సవాలు మూడుకోవెళ్ల, కొత్తపేట మన్నార్ రాజ గోపాలస్వామి ఆలయాల్లోను వేడుకగా జరిగాయి.

## షార్ ఉద్యోగుల క్రెడిట్ సొసైటీకి ఎన్నికలు

శ్రీహరికోట : శ్రీహరికోటలోని షార్ ప్రాజెక్టు ఎంప్లాయిస్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శి, డైరెక్టర్ నియామకానికి ఎన్నికల నగరా మోగింది. ఈ మేరకు నోటిఫికేషన్ జారీ చేశారు. ఇందులో ఆరుగురు డైరెక్టర్లను ఎన్నుకోవాల్సి ఉంది. వారిలోనే ఒకరిని అధ్యక్షుడిగా, మరొకరిని కార్యదర్శిగా ఎన్నుకుంటారు. నామినేషన్ ప్రక్రియ సందర్భేగా 15 మంది తమ నామపత్రాలను దాఖలు చేశారు. మంగళవారం నామపత్రాల పరిశీలన, బుధవారం ఉపసంహరణ ఉంటుంది. ఈనెల పదో తేదీన ఎన్నిక నిర్వహిస్తారు. ఆ రోజు సాయంత్రం ఫలితాలు ప్రకటిస్తారు.

ఈ దఫా ఎన్నికలకు పలువురు రంగంలోకి దిగారు. తప్పనిసరిగా ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. ఈ ఎన్నికల్లో 1820 మంది ఉద్యోగులు ఓటర్లుగా ఉన్నారు.

## పట్టణంలో 14,000 మొక్కలు నాటేందుకు చర్యలు

తుని: తుని పట్టణ వీధుల్లో 14,000 మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నామని పురపాలక ఛైర్మన్ ఇనుగంటి సత్యనారాయణ అన్నారు. వనం-మనం కార్యక్రమంలో భాగంగా కార్యాలయం నుంచి మంగళవారం ఉదయం విద్యార్థులు, డ్వాక్రా మహిళలు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు తదితరులతో కలిసి ర్యాలీ చేపట్టారు. తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి యనమల శివరామకృష్ణన్ జెండా వూపి ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరూ ఒక మొక్క నాటి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారిణి శోభారాణి, కమిషనర్ వెంకట్రావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# తిరుపతి, తిరుమల భద్రతపై ప్రత్యేక దృష్టి

తిరుపతి : చట్టానికి లోబడి ప్రజలకు పోలీసు సేవలను అందించడంతో బాటు.. శాంతిభద్రతల పరిరక్షణకు కృషిచేయనున్నట్లు అర్బన్ జిల్లా నూతన ఎస్పీ అభిషేక్ మహంతి పేర్కొన్నారు. అర్బన్‌జిల్లా ఎస్పీగా ఆయన బాధ్యతలు చేపట్టారు. జిల్లా పోలీసు కార్యాలయానికి రాగానే పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. తనను అధికారులు ఎవరూ కలవరాదని ముందుగానే సూచించి ఆపై నిరాడంబరంగా బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అర్బన్ జిల్లా పరిధిలో సాధారణ పోలీసు పని విధానాన్ని అమలుచేస్తామన్నారు. చట్టానికి లోబడి పోలీసు వృత్తి ధర్మాన్ని కొనసాగిస్తామని పేర్కొన్నారు. తిరుపతి నగరంలో ట్రాఫిక్, నేరాల నియంత్రణలో ఎదురయ్యే సవాళ్లను సమర్థంగా ఎదుర్కొంటామని తెలిపారు. ప్రజలకు పోలీసు విభాగం 24గంటలు అందుబాటులో ఉండేలా చూడటమేకాక.. ప్రజలు తమ సమస్యలపై ఎప్పుడైనా తనను స్వయంగా కలవొచ్చని స్పష్టం చేశారు. ఉద్యోగుల సంక్షేమంపై దృష్టి సారిస్తామని.. సిబ్బంది కొరతను అధిగమిం చేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు.

తిరుమల భద్రతపై తాను స్వయంగా పరిశీలించిన అనంతరం లోపాలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

### ప్రతిరోజూ కనీసం 3 కి.మీ

# సిమెంటు రోడ్లు నిర్మించాలి

## కలెక్టర్ కార్తికేయ మిశ్రా ఆదేశం



కాకినాడ : గ్రామాల్లో జాతీయ ఉపాధి హామీ పథకం అనుసంధానం చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణాన్ని ప్రతీ రోజూ కనీసం 3 కిలోమీటర్ల మేర వేయాలని కలెక్టర్ కార్తికేయ మిశ్రా ఆదేశించారు. ఆయన కలెక్టరేట్ నుంచి జేసీ మల్లికార్జున, రాజమహేంద్రవరం మున్సిపల్ కమిషనర్ విజయరామరాజుతో కలిసి సబ్‌కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వ హించారు. జాతీయ ఉపాధి హామీ పథకం అనుసంధానంతో చేపట్టిన పనుల ప్రగతిని సమీక్షించారు. జిల్లాలో ఈ ఏడాది 632 కి.మీ మేర సీసీ రోడ్లు వేయాలని లక్ష్యం కాగా, ఇప్పటి వరకూ 227 కి.మీ మేర పనులు ప్రారంభించారని, వీటిలో 93 కి.మీ పూర్తి చేశారని చెప్పారు. అంగన్‌వాడీ భవనాలు 133 చోట్ల పనులు ప్రారంభం కావాల్సి ఉందని, నెలాఖరునాటికి ప్రక్రియ మొదలుపెట్టాలని ఆదేశించారు. 70 గ్రామపంచాయతీ భవనాలు నిర్మాణం చేపట్టాల్సి ఉండగా కేవలం 15 మాత్రమే పూర్తి అయ్యా యన్నారు. ఉద్యానవన శాఖ ద్వారా మొక్కలు పెంపకానికి 3,600 మంది రైతులను గుర్తించారని, మరో 3 వేల మందిని ఎంపిక చేయాలని సూచించారు. 706 కి.మీ మేర రోడ్ల వెంబడి మొక్కలు నాటాల్సి ఉందన్నారు. జిల్లాలో 285 ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ యూనిట్లు నెలకొల్పాల్సి ఉందని, వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. ప్రధానంగా ఉపాధి హామీ పథకంలో పనిదినాలు పెంచా లన్నారు. ప్రస్తుతం రోజుకు 93 వేల పనిదినాలు కల్పిస్తున్నారని, దీనిని 1.50 లక్షలకు పెంచాలన్నారు. మస్తరు పూర్తిచేసిన మూడు రోజుల్లో కూలీలకు వేతనాలు చెల్లించాలని ఆదేశించారు.

ఈ విషయంలో వెనుకపడ్డ కాకినాడ గ్రామీణం, తాళ్లరేవు, శంఖవరం, రౌతులపూడి, తొండంగి, రామవరం, గంగవరం, వీఆర్ పురం, నెల్లిపాక, కాజులూరు ఎంపీడీవోలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ఇంకా ఫారం పాండ్స్, ఇతర అంశాలపై సమీక్షించారు.

### అన్నప్రసాదాలు

# వృథా కాకుండా చూడాలి

**తితిదే ఈవో అనిల్ కుమార్ సింఘాల్**

తిరుపతి : జిల్లాలోని కోసువారిపల్లె తరహాలో కృష్ణా జిల్లా నూజివీడులో ఉన్న తితిదే స్థలంలో 8మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యంతో సౌర విద్యుత్తు ప్లాంటు ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని తితిదే ఈవో అనిల్ కుమార్ సింఘాల్ అధికారులను ఆదేశించారు. తితిదే పరిపాలనా భవనంలో సీనియర్ అధికారులతో ఆయన వారపు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో భక్తులకు ఆహారపదార్థాలను అందించే పేపర్ ప్లేట్ల నాణ్యత పెంచి, అన్నప్రసాదాలు వృథా కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నెలాఖరులోపు తిరుమలలో పూర్తిగా ఎల్‌ఈడీ విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలన్నారు. తిరుమలలో ఘనవ్యర్థాల నిర్వహణకు సంబంధించి కాంట్రాక్టర్ ద్వారా త్వరితగతిన పనులు ప్రారంభించాలని సూచించారు. తిరుమల, తిరుపతిలో పచ్చనదం పెంచి సుందరీకరణ పనులు చేపట్టాలని, డివై%ర్లపై మొక్కలు పెంచాలని, రోడ్లకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగించాలని ఆయన అధికారులకు సూచించారు. వివిధ రాష్ట్రాల్లో తితిదేకు సంబంధించిన భూములను సక్రమంగా వినియోగించుకోవడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని జేఈవోను ఆదేశించారు. తిరుచానూరులో నిర్మాణంలో ఉన్న నెయ్యి నిల్వ ట్యాంకులను నెలాఖరులోపు పూర్తిచేయాలన్నారు. శ్రీవారిమెట్టు మార్గంలో త్వరితగతిన అదనపు మరుగుదొడ్లు నిర్మించాలని, తిరుపతిలో శ్రీ గోవిందరాజస్వామివారి 2, 3సత్రాలలో భక్తులకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో తితిదే తిరుమల జేఈవో శ్రీనివాసరాజు, తిరుపతి జేఈవో పోల భాస్కర్, సీవీఎస్‌వో ఎ.రవికృష్ణ, చీఫ్ ఇంజినీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎఫ్ఏ, సిఏవో బాలాజీ, ఎస్ఈ రమేష్‌రెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## సీఐటీయూ కార్యకర్తల రాస్తారోకో

బలిజిపేట: అసంఘటిత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం విజయనగరం కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులపై లాఠీచార్జీ చేసి అరెస్టు చేశారు. దీనిని నిరసిస్తూ.. బలిజిపేటలో సీఐటీయూ కార్యకర్తలు మంగళవారం రాస్తారోకో చేశారు. ఆశా, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహక కమిటీలు, సీఐటీయూ కార్యకర్తలు బలిజిపేట బస్టాండ్‌కు అడ్డంగా ఎర్రజండాలతో ప్రదర్శన నిర్వహించి రాస్తారోకో చేశారు. దీంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు వి.సత్యంనాయుడు, మన్మథరావులు ప్రభుత్వ, పోలీసుల తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజనపథకం నిర్వాహక కమిటీసభ్యులు లక్ష్మి, భవాని, ఆశా కమిటీ సభ్యులు మంగ, సునీత తదితరులు పాల్గొన్నారు.

# వాహన రిజిస్ట్రేషన్‌లో జాప్యం వద్దు

**విశాఖ డీటీవో వెంకటేశ్వరరావు**

రాజమహేంద్రవరం : వాహనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో జాప్యం లేకుండా ఆటోమొబైల్ డీలర్సు వ్యవహరించాలని విశాఖ జిల్లా రవాణాశాఖ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు సూచించారు. లాలాచెరువు ఎస్‌బీ మోటార్సు నందు నగరంలోని ఆటోమొబైల్ వాహన డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్.వెంకటేశ్వరరావు, రాజ మహేంద్రవరం ఆర్టీవో సిరిఆనంద్ పాల్గొని పలు సూచనలు చేశారు. వాహన కొనుగోలు సమయంలో వినియోగదారులకు తాత్కాలిక రిజిస్ట్రేషన్ నంబరును డీలర్లు తక్షణం అందిస్తున్నా కొనుగోలు దారుడుకు సంబంధించి రికార్డులు పూర్తిస్థాయిలో ఆన్‌లైన్‌లో అందచేయకపోవడంతో శాశ్వత రిజిస్ట్రేషన్‌లో జాప్యం జరుగుతోందని రవాణాశాఖ కార్యాలయం కోరిన పత్రాలు వేగవంతంగా ఆన్‌లైన్ చేసి జాప్యాన్ని నివారించాలన్నారు. వినియోగదారుడు పేరున ముందే ఒక వాహనం ఉండి రెండో వాహనం కొనుగోలు సమయంలో రిజిస్ట్రేషన్ ఫీజులో వ్యత్యాసాన్ని గుర్తించి జమచేయాలని ఈ విషయంలో వినియోగదారులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత డీలర్లదేనన్నారు. కారుకు 9 శాతం రిజిస్ట్రేషన్ ఫీజు వసూలు చేయడం జరుగుతుందని వినియోగదారుడు పేరున నూతనంగా కొనుగోలు చేసిన వాహనం రెండో వాహనం అయితే అదనంగా మరో 2శాతం రుసుము చెల్లించాలన్నారు.

ద్విచక్రవాహనానికి 14 శాతం రిజస్ట్రేషన్ ఫీజు ఉంటే రెండో వాహనానికి అదనంగా మరో 5 శాతం వసూలు చేసి ఖజానాకు జమచేయాలని సూచించారు. రిజస్ట్రేషన్‌లో జాప్యం వల్ల వాహనదారుడుకు చట్టపరమైన సమస్యలు ఉంటాయన్నారు. తాత్కాలిక రిజస్ట్రేషన్‌తో తిరగడం వల్ల ప్రమాదం జరిగిన సమయంలో ఇబ్బందులు తలెత్తుతాయని పేర్కొన్నారు. రవాణాశాఖ నిబంధనల మేరకు వాహనం కొనుగోలు చేసిన నెలలోపు శాశ్వత రిజిస్ట్రేషన్ చేసుకునేలా డీలర్లు వినియోగదారుల నుంచి సరైన ధ్రువీకరణ పత్రాలు తీసుకుని ఆన్‌లైన్ చేయాలన్నారు.

ఈ సమావేశంలో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టరు సాయినాథ్, ఏవో విజయసారథి తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ స్మగ్లర్ అరెస్టు

- కారుతో సహా దుంగలు స్వాధీనం
- స్మగ్లర్‌పై 20కి పైగా కేసులు



చిత్తూరు : ఎర్రచందనం అక్రమ రవాణాతో కోట్లాది రూపాయలకు పడగలెత్తిన హాజ్‌నాజిర్ అలియాజ్ నాసిర్ వుల్లాఖాన్(48)ను అరెస్టు చేసి.. అతన్నుంచి కారు, ఎర్ర దుంగలు స్వాధీనం చేసుకున్నామని చిత్తూరు డీఎస్పీ లక్ష్మీనాయుడు వెల్లడించారు. చిత్తూరు తాలూకా పోలీసుస్టేషన్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో నిందితుడ్ని చూపించి వివరాలు వెల్లడించారు. జిల్లా ఎస్పీ రాజశేఖర్‌బాబు ఆదేశానుసారం పోలీసులు వేర్వేరు బృందాలుగా ఏర్పడి వేకువజామున వాహన తనిఖీలు చేపట్టాం. ఓ బృందం పెనుమూరు మలుపులో తనిఖీలు చేస్తుండగా.. అటుగా వస్తున్న కారును ఆపి క్షుణ్ణంగా పరిశీలించారు. అందులో ఎర్ర దుంగలుం డటంతో.. కారులోని వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించాం. కర్ణాటక రాష్ట్రం బెంగళూరులోని ఓల్డ్ పెన్షన్‌మొహల్లాకు చెందిన నజీర్‌ఉల్లాఖాన్ కుమారుడు హాజ్‌నాజిర్ అలియాజ్ నాసిర్‌వుల్లాఖాన్‌గా నిర్ధారించాం. గుజిరీ సామగ్రి, పాత దుస్తులు క్రయవిక్రయాలు చేస్తూ.. హఠాత్తుగా రూ.కోట్లకు పడగలెత్తెనట్లు తెలిసింది. కర్ణాటక రాష్ట్రం కటిగినహళ్లిలోనే బడా స్మగ్లరుగా పేరొంది, అంతర్జాతీయ స్మగ్లరుగా ఎదిగినట్లు నిందితుడు ఒప్పుకున్నాడు. 2014లో ఎర్రచందనం అక్రమ రవాణాలోకి అడుగుపెట్టిన అతడు.. ఇప్పటి వరకు వెయ్యి టన్నులకుపైగా దుంగలను అక్రమంగా రవాణా చేసినట్లు తెలిసింది. వాటి విలువ సుమారు రూ.30 కోట్లు నుంచి రూ.40 కోట్లు వరకు ఉంటుందని అంచనా. నిందితుడు తమిళనాడు రాష్ట్రంలోని స్మగ్లర్లతో పరిచయాలు పెట్టుకుని మలేషియా, దుబాయి వంటి దేశాలకు ఎర్ర దుంగలను ఎగుమతి చేస్తున్నాడు. జిల్లాకు చెందిన సంపదను కొల్లగొట్టడమే కాకుండా పోలీసులకే సవాల్ విసిరే స్థాయికి ఎదిగి, మోస్ట్‌వాంటెడ్ ఖాతాలో ఉన్నాడు. ఇప్పటి వరకు అతనిపై సుమారు 20కిపైగా కేసులున్నాయి. కేసు ఛేదించడానికి కృషి చేసిన పోలీసు అధికారులను అభినందించారు. ఎర్రచందనం కార్యదళం డీఎస్పీ గిరిధర్, తాలూకా సీఐ చంద్రశేఖర్, ఎస్సైలు పాల్గొన్నారు.


# జీఎస్టీతో భవిష్యత్తులో ధరలు తగ్గుముఖం

## గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్

గుంటూరు : జీఎస్టీ వల్ల భవిష్యత్తులో ధరలు తగ్గుతాయని గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్ పేర్కొన్నారు. గుంటూరులోని తన కార్యాలయంలో ఆయన మిర్చియార్డు అధికారులు, ఎగుమతి, దిగుమతి సంఘాల నాయకులతో సమావేశమై జీఎస్టీ ప్రవేశపెట్టాక పరిస్థితులపై సమీక్షించారు. జీఎస్టీ అమల్లోకి వచ్చాక వ్యాపార పరంగా ఇబ్బందులు ఎమైనా ఉన్నాయా అని ఆరా తీశారు. నిత్యావసర వస్తువె%న ఉప్పునకు జీఎస్టీ నుంచి మినహాయింపు ఇచ్చారని, కారం, ఎండుమిర్చిపై కూడా అదేవిధంగా మినహాయింపు ఇచ్చేవిధంగా చూడాలని కోరారు. దీనికి ఎంపీ జయదేవ్ స్పందిస్తూ పార్లమెంటు సమావేశాల్లో కేంద్రం దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్తామని వివరించారు. జీఎస్టీ అమల్లోకి రావడం వల్ల దేశం అంతా ఒకే పన్నుల విధానం అమల్లో ఉంటుందన్నారు. చెక్‌పోస్టులు కూడా ఎత్తివేయడం వల్ల గతంలో వారం రోజులకు గమ్యస్థానాలకు చేరే సరకు ఇప్పుడు రెండు రోజుల్లోనే వెళ్తుందన్నారు. జీఎస్టీ నిబంధనలు ప్రారంభంలో అర్థం కాకపోయినా ఆ తర్వాత అంతా బాగుంటుందని తెలిపారు. మొదట ఆరు నెలలు కొన్ని సమస్యలు ఉంటాయని, ఆ తర్వాత ధరలు కూడా దిగివస్తాయని వెల్లడించారు. కార్యక్రమంలో మిర్చియార్డు కార్యదర్శి దివాకర్, గుంటూరు తూర్పు తెదేపా ఇన్‌ఛార్జ్ మద్దాళి గిరిధర్, జిల్లా పార్టీ ప్రచార కార్యదర్శి చిట్టాబత్తిన చిట్టిబాబు, మిర్చి ఎగుమతి, దిగుమతి అసోసియేషన్ల నాయకులు పాల్గొన్నారు.

## గ్యారేజి తరలింపు ఉపసంహరించుకోవాలి

తిరుపతి : రాష్ట్రాల స్వేచ్ఛను, హక్కులను కేంద్రంలో మోదీ ప్రభుత్వం కాలరాస్తోందని మాజీ ఎంపీ చింతామోహన్ విమర్శించారు. నగరంలోని ఆర్టీసీ ప్రాంతీయ గ్యారేజీ తరలింపును ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. గ్యారేజిలో పనిచేసే ఉద్యోగ, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. గ్యారేజి తరలింపును వ్యతిరేకిస్తూ కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని సందర్శించి వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రైవేటీకరణ, సరళీకరణ విధానాలు వల్ల ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేస్తున్న వేలాది మంది ఉద్యోగులకు, కార్మికులు అభద్రతకు గురవుతున్నారన్నారు. 50ఏళ్ల క్రితం ఇక్కడ ఈ గ్యారేజిని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు.ప్రస్తుత ప్రభుత్వం దీన్ని నెల్లూరుకు తరలించేందుకు కుట్ర చేస్తోందన్నారు. ఈ ప్రయత్నాలను సంఘటితంగా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఈ ఆందోళనకు కాంగ్రెస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఇరవైఏళ్ల క్రితం గ్యారేజిలో పనిచేసే 22మంది కార్మికులను అప్పటి ప్రధాని రాజీవ్‌గాంధీ చొరవతో తితిదే అనుబంధ ఉద్యోగులుగా గుర్తింపు ఇచ్చామన్నారు.




# బరువు తగ్గించే కొబ్బరినూనె!



కొబ్బరినూనె సాధారణంగా ప్రతి ఇంటిలోను వాడుతూంటారు. కొబ్బరి నుండి తీసే ఈ నూనెలో అనేక ఔషధ మరియు ఆహార ప్రయోజనాలున్నాయి. కొబ్బరినూనెతో అనేక వంటకాలు కూడా చేస్తారు. కొబ్బరి చెట్లు అధికంగా వుండే కేరళ వంటి రాష్ట్రంలో కొబ్బరినూనె వాడకం ఎంతో విరివిగా చేస్తారు. కొబ్బరినూనె దాని రుచికే కాక, బరువును తగ్గించేందుకు కూడా వాడతారు. బరువు తగ్గాలనుకునేవారికి సరైన వంట నూనె కొబ్బరినూనె. మరి కొబ్బరి నూనె బరువును ఎలా తగ్గిస్తుందనే అంశంపై కొన్ని వాస్తవాలు పరిశీలించండి.

**బరువు తగ్గేటందుకు కొబ్బరినూనె వాడకం ..**

1. కొబ్బరి నూనె తేలికగా జీర్ణం అవుతుంది. దానికి కారణం అందులో ఫ్యాటీ యాసిడ్లు తక్కువ కనుక తేలికగా జీర్ణం అయిపోతుంది. శరీరంలో కొవ్వు నిల్వలు ఏర్పడకుండా కూడా వుంటుంది.
2. కొబ్బరినూనెలోని ట్రిగ్లీ సెరైడ్స్ జీవక్రియను పెంచి, ఫ్యాటీ యాసిడ్లను శక్తిగా మారుస్తాయి.
3. కొబ్బరి నూనె వాడకం ద్వారా మీరు తినాలనే కోరికలను తగ్గించుకోగలరు. ఈ నూనెలో కార్బోహైడ్రేట్లు అధికం. కేలరీలు అధికంగా వుండి ఆకలిని నియంత్రిస్తాయి.
4. బరువు తగ్గాలంటే మీ ఆహారంలో కొబ్బరి నూనె తప్పక చేర్చండి. వంటనూనెలలో ఆహారాలు వేయించే బదులుగా కొబ్బరి నూనె లో వేయించి మార్పు గమనించండి.
5. మీ లోని జీవ క్రియ పెంచేటందుకుగాను వ్యాయామానికి ముందు ఒక టేబుల్ స్పూన్ కొబ్బరినూనె ఒక గ్లాసు వేడి నీటిలో వేసి తాగితే బరువు కూడా తగ్గుతుంది.
6. కొబ్బరినూనె జీర్ణక్రియ మెల్లిగా జరిగేలా చేసి ఆకలి లేకుండా చేస్తుంది. అంతేకాదు రక్తంలోని బ్లడ్ షుగర్ స్థాయిలను నియంత్రిస్తుంది.
7. బరువు పెరగటం, ఆకలి, అలసటలకు సంబంధించిన కేండిడా అనే ఒక ఈస్ట్ ను కొబ్బరినూనె అరికడుతుంది.
8. కొబ్బరినూనెనుండి ప్రయోజనాలు అధికంగా పొందాలంటే, దానిని రీఫైన్ చేయరాదు. స్వచ్ఛమైన కొబ్బరి నూనెను మాత్రమే వాడాలి. కనుక బరువు తగ్గాలనుకునేవారు తమ ఆహారంలో రుచికరమైన కొబ్బరినూనె చేర్చి బరువు, ఆరోగ్యం రెండూ పొందవచ్చు.

## మహిళల ఆరోగ్యకరమైన ఆహారాలు!



ఆరోగ్యకరమైన ఆహారాలు అంటే సహజంగా పచ్చటి కూరగాయలు, ఆకుకూరలు, తాజా పండ్లు, గింజధాన్యాలు, పప్పులు మొదలైనవిగా వుంటాయి. అయితే, కొంతమంది మహిళలకు 30 సంవత్సరాల వయసు పైబడినవరికి విటమిన్లు, ప్రొటీన్లు అధికంగా వుండే ఆహారాలు కావాలి. వ్యాధులతో పోరాడటానికి, సంతానోత్పత్తికి, ఆరోగ్యకరమైన శరీరంకొరకు వీరికి ఈ ఆహారాలు ప్రధానం. మీరు కనుక 30 సంవత్సరాలుపైబడిన మహిళలైతే, విటమిన్లు, ప్రొటీన్లు అధికంగా వుండే ఆహారాలను మీ రోజువారీ ఆహారంలో తప్పక చేర్చండి.

**30 సంవత్సరాలు పైబడిన మహిళలకు ఆహారం!**

ఐరన్ అధికంగా - మహిళ ప్రతినెలా తన శరీరంనుండి పిరియడ్ కారణంగా కొంత ఐరన్ నష్టపోతుంది. ఐరన్ తగ్గితే అది మిమ్మల్ని బలహీనపరచి శరీరంలో రక్తహీనత ఏర్పరుస్తుంది. ఐరన్ అధికంగా వుండే ఆహారాలు, అలసట పోగొట్టి, రక్తహీనత, జుట్టు రాలటం, తలనొప్పి వంటివి కలిగించకుండా వుంటాయి. పచ్చని కూరలు, ఆకు కూరలు, బచ్చలి, గోంగూర, బీన్స్ వంటి వాటిలో ఐరన్ అధికం. లివర్, టూనా చేప కూడా అధిక ఐరన్ కలిగి వున్నాయి.

పండ్లు - 30 సంవత్సరాలు పైబడిన మహిళకు పచ్చి లేదా తాజా పండ్లు మంచి పోషకాలనిస్తాయి. వీరికి ఐరన్, కాల్షియం రెండూ ప్రధానం. బొప్పాయి, బఠాణీ, ఆలివ్, స్ట్రాబెర్రీ, ఆరెంజ్, కేన్ బెర్రీలు జంక్ ఫుడ్ బదులుగా తినండి. ఆకలి, అలసటలను వదలాలంటే పండ్లు తినాలి కాల్షియం - విటమిన్ డి, మెగ్నీషియంలతో ఇది వస్తుంది. 30 సంవత్సరాల పైన మంచి కార్బోహైడ్రేట్లు, కొవ్వులు మిమ్మల్ని రక్తపోటునుండి, గుండె జబ్బులనుండి కాపాడతాయి. కొవ్వు తక్కువగా వున్న పాల ఉత్పత్తులు, గోంగూర, బచ్చలి, వేపిన చేపలుసల్మాన్, టూనా, కొవ్వు తక్కువవుండే జున్ను, గుడ్లు, వెన్నతీసిన పాలు , గింజలు తినాలి. జంతు సంబంధిత ప్రొటీన్లు శరీరంనుండి కాల్షియం తీసుకుంటాయి. కనుక వీటిని తగ్గించండి. సాధ్యమైన మేరకు మొక్కల సంబంధిత ఆహారాలు తినాలి.

కొవ్వులు - చెడు కొల్లెస్టరాల్ తగ్గాలంటే మోనోశాట్యురేటెడ్ ఆహారాలు తినాలి. ఇవి గుండె జబ్బులు, రక్తపోటు, షుగర్ వ్యాధి రాకుండా చేస్తాయి. బాదంపప్పులు, జీడిపప్పులు, బీఫ్, ఓట్ మీల్, పస్తా, బ్రౌన్ బ్రెడ్, వాల్ నట్స్, నువ్వులు, గుమ్మడి గింజలు మొదలైనవి మోనో శాట్యురేటెడ్ కొవ్వులు కలిగి వుంటాయి. మొక్క సంబంధిత నూనెలు ఆలివ్ నూనె, కెనోలా నూనె, గ్రేప్ సీడ్ నూనె, అవిసె గింజల నూనె మొదలైనవి కూడా 30 ఏళ్ళ మహిళలకు మంచివే. ఈ వయసు మహిళలు, ఆహారం ఒకటే తీసుకుంటే చాలదు. శారీరక సౌష్టవం కొరకు క్రమం తప్పకుండా కొంత సమయం రోజూ వ్యాయామం కూడా చేయాలి. తగినంత నీరు తాగి శరీరంలోని మలినాలు విసర్జించాలి.

## 30 సంవత్సరాలు దాటిన పురుషులు...
# ఖచ్చితంగా చేయాల్సిన పనులు



ఒక మనిషి 18-20 సంవత్సరాల మధ్య చాలా బలంగా, శక్తివంతంగా ఉంటాడని అనేక సర్వేలు చెప్తున్నాయి! ఆ తరువాత, చురుకైన జీవనశైలి లేకపోతే క్రమంగా అతను తన బలాన్ని, గట్టి పటిమను కోల్పోతాడు. అందువల్ల, పురుషులు ఎల్లపుడూ ఆరోగ్య చిట్కాలను వ్యయమ చిట్కాలతో ప్రారంభించాలి. వయసు పెరగడం వాళ్ళ కొన్ని రకాల ఆరోగ్య సమస్యలు వస్తాయి. బ్లేడ్ ప్రేసర్, మధుమేహం, ఊబకాయం సమస్యలు, పడకగది వైఫల్యాలు, నపుంసకత్వం, ఒత్తిడి వంటి రుగ్మతలు.

**30ఏళ్ళ తర్వాత మగవారు చేయకూడని 9 ఖచ్చితమైన పనులు** అవును, పురుషుల ఆరోగ్య చిట్కాలు సాధారణంగా వ్యాయామం మీద ఆధారపడి ఉన్నాయి, ఎందుకంటే కొన్ని దశాబ్దాలుగా యువత నుండి ఇవి విస్తరించి వస్తూ ఉన్నాయి కాబట్టి వాటిమీద నమ్మకం. కొలెస్ట్రాల్‌ను తగ్గించు కోవడానికి సహజమార్గాలు... ఆరోగ్యవం తమైన జీవితం కోసం, మంచి ఆహరం, సరైన వ్యాయామం అవసరం. పురుషులు 30 సంవత్సరాలు దాటిన తరువాత వారి సహజ టేస్టోస్తేరాన్ స్థాయిలను కోల్పోతారని గుర్తుం చుకోండి.

**పరీక్షించుకోండి** రక్తపోటు తక్కువగా ఉండేట్టు ప్రయత్నించండి. మీకు బ్లెడ్ ప్రేసర్ సాధారణంగా ఉన్నప్పటికీ, అది పెరగకుండా, ఆరోగ్యంగా ఉండడానికి మీ వైద్యుడిని సలహాలు అడగండి.

**కొద్దిగా ఫైబర్ ని తీసుకోండి** మీ ఉదయపు అల్పాహారంలో ఫైబర్ ఎక్కువగా ఉండే ధాన్యాలు లేదా పచ్చి కూరగాయలు ఉండేట్లు చూసుకోండి. ఈ ఆహరం అనేక ఆరోగ్య సమస్యలను నిర్మూలిస్తుంది.

**మీ వెన్నుపూస మీద శ్రద్ధ పెట్టండి** ఊబకాయం ఉన్నవాళ్ళకు మాత్రమే వెన్నునొప్పి వస్తుందని అనుకోకండి. ఇది ఎవరికైనా, ఏ సమయంలోనైనా రావచ్చు. వెన్నునొప్పితో మీ జీవితాన్ని నరకం చేసుకోవద్దు, దాన్ని బలంగా ఉంచుకోండి.

**శృంగారాన్ని ఆస్వాదించండి** ప్రేమ, శృంగారం లేని జీవితం నెమ్మదిగా ఒత్తిడికి దారితీస్తుంది. ప్రేమతో కూడిన జీవితం గొప్పదని నిర్ధారిం చుకోండి.

**బరువు పై దృష్టి ఉంచండి** మీరు 30 సంవత్సరాల వయసు దాటినపుడు, మీ జీవక్రియలో కొద్దిగా వేగం తగ్గుతుంది. దీనివల్ల మీరు రోజు కంటే కొంచెం తక్కువ తిన్నప్పటికీ బరువు పెరుగుతారు.

**క్యాలరీలు కరగడానికి మార్గాలను వెతకండి** మెట్లు ఎక్కడం. పనిమీద కృషిచేయండి. ఒక కొత్త పంధాలో క్యాలరీలను కరిగించడానికి ఇలాంటి అనేక మార్గాలను ఆలోచించండి. ఇది మీరు బరువు పెరగకుండా కాపాడుతుంది.

**మీ ఇష్టాలను వదిలేయండి** పొగత్రాగడం, మద్యం సేవించడం మీకు అపారమైన ఆనందాన్ని కలిగించినప్పటికీ 30 సంవత్సరాల వయసు దాటిన తరువాత మీ ఆరోగ్యం కోసం వాటిని మానేయడం మంచిది.

**మీ గుండెను రక్షించుకోండి** చురుకైన జీవితం, కొవ్వులేని ఆహరం తీసుకోవడం ప్రధానాంశాలు. గుండె ఆరోగ్యంగా ఉండడానికి ఇలాంటి నియమాలను పాటించండి.

# మైగ్రేన్‌కు చెక్ పెట్టండిలా

మహిళల్లో ఒత్తిడి శాతం పెరిగిపోయి అది క్రమంగా మైగ్రేన్ తలనొప్పిగా తయారయ్యే ప్రమాదం లేకపోలేదని వైద్యులు చెబుతున్నారు. ఇప్పుడు అటువంటి మైగ్రేన్ తలనొప్పికి విరుగుడుగా ఆకుప చ్చని యాపిల్స్ మార్కెట్లో లభ్యమవుతున్నాయి. వీటిని తింటే మైగ్రేన్ తలనొప్పిని దూరం చేయవచ్చని వైద్య్ు లు చెబుతున్నారు.చిట్స్ కట్టాలి, ఎల్ఐసీ పాలసీలు కట్టాలి, పిల్లల స్కూలు ఫీజులు కట్టాలి.వీటన్నింటినీ ఆ వచ్చి న డబ్బుతోనే సరిపెట్టాలి. ఇంకా అవకాశం ఉంటే వీటిల్లోనే సేవ్ చేసి భర్త అవసరాలకి సర్దుబాటు చేయాలి. ఒక పక్క ఇన్ని పనులు ఒంటిచేత్తో చేస్తూనే మరో పక్క తన ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తిస్తూ ఇంటిల్లిపాది బట్ట లు, అంట్లు తానే చేయాల్సివస్తోంది. మరి ఇన్ని సమస్యలను నెట్టుకొస్తున్న మహిళల్లో ఒత్తిడి శాతం పెరిగి పోయి అది క్రమంగా మైగ్రేన్ తలనొప్పిగా తయారయ్యే ప్రమాదం లేకపోలేదని వైద్యులు చెబుతున్నారు. నేటి ఆధునిక యాంత్రిక జీవనంలో ఒత్తిడికి లోనయ్యేది ఎక్కు వగా ఆడవారేనని సర్వేలు చెబుతున్నాయి. మగవారు కేవలం సంపా దించడం వరకు మాత్రమే పరిమితం అవుతున్నారు. ఇం ట్లో చిన్నచిన్న విషయాలన్నింటినీ ఆడవారే దగ్గరుండి మరీ చూసు కోవాల్సివస్తోంది. ఉదయం లేచిన దగ్గరనుంచి పాలబిల్లు, కరెంట్ బిల్లు, ఎటిఎంలో డబ్బులు డ్రా చేయడం, అవసరం అనుకుంటే బ్యాంకులకు వెళ్లి గోల్డ్ లోన్ తీసుకురావడం వంటి పనులతో పాటు రొటీన్‌గా తెచ్చే కూరగాయలు, ఇంటి సరుకులు ఇవన్నీ ప్లాన్ చేసుకుని తీసుకురావడంలో మహిళలు ప్రధానపాత్ర వహి స్తున్నారు. మగవారు కేవలం ఒక పదివేలు లేకపోతే 12 వేలు సింపుల్‌గా తమ భార్యల చేతుల్లో పోసేసి చేతులు దులుపు కుం టున్నారు. మళ్లీ ఆ డబ్బులతోనే చిట్స్ కట్టాలి, ఎల్ఐసీ పాలసీలు కట్టాలి, పిల్లల స్కూలు ఫీజులు కట్టాలి వీటన్నింటినీ ఆ వచ్చిన డబ్బుతోనే సరిపెట్టాలి. ఇంకా అవకాశం ఉంటే వీటిల్లోనే సేవ్ చేసి భర్త అవసరాలకి సర్దుబాటు చేయాలి. మళ్లీ మధ్యలో డబ్బుకోసం చెయ్యిచాచాల్సివస్తే భర్తలు నీకిచ్చిన డబ్బుకు లెక్కచెప్పమంటూ దబాయిస్తుంటారు. ఒక పక్క ఇన్ని పనులు ఒంటిచేత్తో చేస్తూనే మరో పక్క తన ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తిస్తూ ఇంటిల్లిపాది బట్ట లు, అంట్లూ తానే చేయాల్సివస్తోంది. మరి ఇన్ని సమస్యలను నె ట్టుకొస్తున్న మహిళల్లో ఒత్తిడి శాతం పెరిగిపోయి అది క్రమంగా మైగ్రేన్ తలనొప్పిగా తయారయ్యే ప్రమాదం లేకపోలేదని వైద్య్ు లు చెబుతున్నారు. ఇప్పు డుఅటువంటి మగ్రేన్‌తలనొప్పికి విరుగు డుగా ఆకుపచ్చని యాపిల్స్ మార్కెట్లో లభ్యమవుతున్నాయి. వీటి ని తింటే మైగ్రేన్ తలనొప్పిని దూరం చేయవచ్చని వైద్యులు చెబు తున్నారు. మైగ్రేన్ ఉన్నవారు తీవ్రమైన తలనొప్పితో బాధపడుతున్నపుడు గ్రీన్ యాపిల్ వాసన పీల్చితే ఉపశమనం లభిస్తుంద ని చికాగోలో జరిపిన పరిశోధనలో తేలింది. మైగ్రేన్ వచ్చినప్పు డు టాబ్లెట్‌కు బదులు గ్రీన్ యాపిల్ వాసన పీల్చిచూడండి తేడా మీకే తెలుస్తుందని నిపుణులంటున్నారు.

# చాక్లెట్ తింటే మధుమేహం దూరం!




లండన్ః రోజూ వంద గ్రాముల చాక్లెట్ తిని మధుమేహాన్ని దూరం చేసుకోవచ్చంటున్నారు తాజా అధ్యయనకారులు. త్వరలో డాక్టర్లు కూడ ఇదో వైద్యంగా సలహా ఇచ్చే అవకాశం ఉందంటున్నారు. డార్క్ చాక్లెట్ తీసుకోవడం ద్వారా ముధుమేహాన్ని నియంత్రించ వచ్చని లండన్ లోని వార్విక్ యూనివర్శిటీ జరిపిన పరిశోధనల్లో వెల్లడైంది. చాక్లెట్ లో ఉండే పదార్థాలు ఇన్సులిన్ లెవెల్స్ ను నియంత్రిస్తాయని తద్వారా గుండె జబ్బులు కూడ వచ్చే అవకాశం తగ్గుతుందని చెప్తున్నారు. వార్విక్ విశ్వవిద్యాలయం అధ్యయనకారులు 18 నుంచి 69 ఏళ్ళ మధ్య వయసుగల 1153 మందిపై నిర్వహించిన పరిశోధనల్లో తాజా విషయాలు వెలుగులోకి వచ్చాయి. చక్కెర వ్యాధి గ్రస్థులు ప్రతిరోజూ వంద గ్రాముల డార్క్ చాక్లెట్ తీసుకోవడం వల్ల మధుమేహం నియంత్రణకు సహకరించడంతోపాటు ఇతర హృద్రోగ సమస్యలు కూడ చాలావరకూ తగ్గే అవకాశం ఉందని లక్సెంబర్గ్ పరిశోధనల్లో తెలుసుకున్నారు. డార్క్ చాక్లెట్ తయారీకి వినియోగించే కోకోలో మధుమేహాన్ని నియంత్రించే శక్తి ఉన్నట్లు పరిశోధకులు కనుగొన్నారు. ప్రతిరోజూ 100 గ్రాముల చాక్లెట్ ను తీసుకోవడం వల్ల లివర్ లోని ఎంజైములు అభివృద్ధి చెంది, ఇన్సులిన్ ను నియంత్రించేందుకు తోడ్పడుతుందని పరిశోధకులు చెప్తున్నారు. అలాగే ఈ చాక్లెట్ ను ప్రతిరోజూ తీసుకునేవారు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉంటారని, రోజుకు 28.8 గ్రాముల చొప్పున ప్రతిరోజూ తీసుకునే వారిలో చురుకుదనం పెరిగి ఉత్సాహంగా ఉన్నట్లు పరిశోధనల్లో తేలినట్లు చెప్తున్నారు.

అంతేకాక కోకో ఉన్న ఉత్పత్తులను తరచుగా తీసుకోవడం వల్ల కూడ గుండె సంబంధిత వ్యాధులకు దూరంగా ఉండొచ్చని, ఇది గుండె మెటబాలిక్ కండిషన్ ను మెరుగు పరుస్తుందని వార్విక్ మెడికల్ స్కూల్ పరిశోధకుల సెవేరియో స్టేంజెస్ తెలిపారు. పరిశోధనా వివరాలను బ్రిటిష్ జర్నల్ ఆఫ్ న్యూట్రిషన్ లో ప్రచురించారు.

# నిద్రలేమి సమస్యను నివారించే.. హెల్తీ బెడ్ టైమ్ డ్రింక్స్



**రాత్రుళ్ళు** నిద్రించడానికి సమస్యగా ఉందా? అలాంటి వారికోసం నిద్రలేమి సమస్యకు పరిష్కారం ఉంది. నిద్రలేమి సమస్యను నయం చేసుకోవడానికి వివిధ రకాల మందులు, వంటింటి చిట్కాలు, ఆయుర్వేద ట్రీట్మెంట్స్ మరియు ట్రిక్స్ తో ఇప్పటికి విసిగెత్తిపోయారా? అయితే ఇవన్నీ కాకుండా కొన్ని బెవరేజెస్ (పానీయాలను )మీరు ఎప్పుడైనా ట్రై చేశారా? ఈ పానియాలు మీరు రాత్రుల్లో త్రాగడం వల్ల గాఢంగా మరియు పీస్ ఫుల్ గా నిద్రించేలా చేస్తాయి. నిద్రకు



ఉపక్రమింపచేసే 13 ఆశ్చర్యకరమైన ఆహారాలు రీసెంట్ గా జరిగిన ఒక పరిశోధన ప్రకారం రాత్రి సమయాల్లో 8 రకాల పానీయాలు నిద్ర బాగా పట్టేందుకు ఉపయోగపడు తాయని కనుగొన్నారు . ఈ ఎఫెక్టివ్ డ్రింక్స్ మీరు గాఢంగా నిద్రపోయేలా చేయడం మాత్రమే కాదు, మరుసటి రోజు మీరు మరింత ఉత్సహం, ఆరోగ్యంగా.. అందంగా కనబడేలా చేస్తాయి. వార్మ్ టీ, హెర్బల్ టీ , చాక్లెట్ టీ మరియు మరికొన్ని పానీయాల లిస్ట్ ను మీకోసం..మీరు ప్రయత్నించడం కోసం ఉన్నాయి. వీటిని ప్రయత్నించి మంచి నిద్రను పొందండి. ఇటు అనారోగ్యాన్ని... అటు నిద్రాభంగి మను కలిగించే 10 ఆహారాలు.. బాగా నిద్రపట్టాలంటే కాఫీకి దూరంగా ఉండాలి. ఇది మిమ్మల్ని మేల్కొనేలా చేస్తుంది. మరియు రాత్రుల్లో తీసుకొనే పానియాల్లో షుగర్ చేర్చకుండా తీసుకోవడం వల్ల మరింత యాక్టివ్ గా పనిచేస్తాయి.

మంచిగా నిద్రపట్టేలా చేస్తాయి. మరి 8 బెస్ట్ బెడ్ టైమ్ బెవరేజెస్ ఏంటో ఒక సారి ఈ క్రింది లిస్ట్ ద్వారా తెలుసుకుందాం. మంచి నిద్రతో మన ఆరోగ్యాన్ని కాపాడుకుందాం...

**హాట్ చాక్లెట్:** పాలలో హాట్ చాక్లెట్ సిరప్ ను మిక్స్ చేసి త్రాగడం వల్ల పొట్ట నిండుగా ఉన్న అనుభూతి కలిగిస్తుంది మరియు నరాలను విశ్రాంతి పరుస్తుంది.

**మింట్ టీ:** కొద్దిగా నిమ్మరంస మిక్స్ చేసి పుదీనా టీని త్రాగడం వల్ల చిన్న పిల్లలు నిద్రపోయినంత గాఢంగా మీరు నిద్రపోతారు. మీరు నిద్రించడానికి ఒక గంట ముందు ఈ టీని ప్రయత్నించండి.



**చామంతి టీ:** చమోమెలీ టి స్మూతింగ్ బెవరేజ్. రాత్రి పడుకొనే ముందు ఒక గంట ముందుగా త్రాగాలి. ఈ టీ త్రాగడం వల్ల నరాలను విశ్రాంతి పరుస్తుంది మరియు ఒత్తిడి తగ్గిస్తుంది.

**కోక్:** చాలా మంది ఎక్కువగా ఇష్టపడే మరో బెవరేజ్ హాట్ కోక్. నిద్రలేమితో బాధపడే వారు వేడిగా ఉండే కోక్ త్రాగితో స్మూత్‌గా నిద్రపట్టే స్తుంది. దీన్ని మీ డైలీ హ్యాబిట్ గా మార్చుకోవాలి.

**గోరువెచ్చని పాలు:** నిద్రలేమితో బాధపడుతు న్నట్లైతే మీరు ఒక గ్లాసు గోరువెచ్చని పాలలో ఒక స్పూన్ హనీ మిక్స్ చేసి నిద్రించడానికి ఒక గంట ముందు త్రాగితే మంచి నిద్రపడు తుంది.

**బాదం మిల్క్:** బాదం మిల్క్ లో విటమిన్ ఇ పుష్కలంగా ఉండటం వల్ల, బాదం పౌడర్ ను గోరువెచ్చని పాలలో మిక్స్ చేసి రాత్రి నిద్రించ డానికి ముందు త్రాగాలి.

**హనీ మిల్క్:** ఒక గ్లాసు గోరువెచ్చని పాలలో ఒక టేబుల్ స్పూన్ తేనె మిక్స్ చేసి త్రాగడం వల్ల వెంటనే నిద్ర పట్టేస్తుంది.

**అల్లం టీ:** వేడి వేడి జింజర్ టీ త్రాగడం వల్ల జీర్ణక్రియ మెరుగవుతుంది. పొట్ట లైనింగ్ కూల్ గా ఉంటుంది. గుడ్ నైట్ రెస్ట్ పొందుతారు.

# చిత్రభాను

# చుక్కల్లో... పారితోషికాలు

దక్షిణాదిలో కథానాయికల పారితోషికాల గురించిన ప్రస్తావన వస్తే ముందుగా చెప్పుకోవాల్సిన పేరు నయనతార. తెలుగులో వచ్చిన శ్రీరామరాజ్యం చిత్రం తరువాత మహిళా ప్రధాన చిత్రాలకే పరిమితమైందీ కేరళ సోయగం. స్టార్ హీరోలకు ధీటుగా స్టార్‌డమ్‌ను సొంతం చేసుకున్న నయనతార తనకంటూ ప్రత్యేకమైన మార్కెట్‌ను ఏర్పరచుకుని ప్రస్తుతం వరుస విజయాల్ని సాధిస్తున్నది. గత కొంత కాలంగా కోటి నుంచి కోటిన్నర తీసుకునే నయన ఇటీవల తమిళంలో రూపొందిన తని ఒరువన్, మాయ, నానుమ్ రౌడీథాన్ చిత్రాలు వరుసగా సక్సెస్ సాధించడంతో తన పారితోషికాన్ని మూడు కోట్లకు పెంచినట్లు తమిళ వర్గాల సమాచారం. తమిళంలో ప్రస్తుతం చిన్న చిత్రాలకు హీరోయిన్ అంటే అతిశయోక్తికాదేమో. బాహుబలిలో దేవసేనగా తనదైన నటనను ప్రదర్శించి విమర్శకుల ప్రశంసలందుకున్న ఈ యోగా టీచర్ తన పారితోషికాన్ని కూడా పెంచేసింది. గుణశేఖర్ దర్శకత్వంలో చారిత్రక నేపథ్యంలో రూపొందిన రుద్రమదేవి చిత్రానికి ముందు కోటి నుంచి కోటిన్నర తీసుకున్న అనుష్క బాహుబలితో పారితోషికాన్ని పెంచేసింది. రెండు భాగాలకు గానూ అక్షరాలా నాలుగు కోట్లు తీసుకున్నట్టు సమాచారం. ప్రస్తుతం అనుష్క ఒక్కో సినిమాకు దాదాపు మూడు కోట్లు డిమాండ్ చేస్తున్నట్లు చెబుతున్నారు. ఆమెకున్న స్టార్‌డమ్‌ని ద ృష్టిలో పెట్టుకుని నిర్మాతలు స్వీటీ (అనుష్క) అడిగినంత పారితోషికం ఇవ్వడానికి ముందుకొస్తున్నారు. తాజాగా నటిస్తున్న మహిళా ప్రధాన చిత్రం భాగమతి కోసం అనుష్క దాదాపు నాలుగు కోట్లకు మించి తీసుకున్నట్లు సమాచారం. బాహుబలి ది కన్‌క్లూజన్‌తో దేశవ్యాప్తంగా గుర్తింపును సొంతం చేసుకున్న ఆమె రానున్న రోజుల్లో బాలీవుడ్‌కు వెళ్లే అవకాశం వుందని తెలిసింది.

**ఆ ఇద్దరి తరువాత....**

కోటి నుంచి దాదాపు రెండు కోట్లు అందుకుంటున్న నాయికల జాబితాలో సమంత, రకుల్‌ప్రీత్‌సింగ్, కీర్తిసురేష్ వున్నారు. వీరిలో ప్రథమంగా వినిపించే పేరు సమంత. కెరీర్ ప్రారంభం నుంచి వరుస విజయాల్ని సొంతం చేసుకుంటూ క్రేజీ కథానాయికగా పేరుతెచ్చుకున్న సమంత ఒక్కో సినిమాకు ప్రాజెక్ట్‌ను బట్టి రెండు కోట్ల వరకు డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం రామ్‌చరణ్‌తో సుకుమార్ తెరకెక్కిస్తున్న రంగస్థలం చిత్రంతో పాటు నాగార్జున నటిస్తున్న రాజుగారి గది-2, విజయ్‌తో మెర్సల్, తెలుగు, తమిళ భాషల్లో సావిత్రి జీవిత కథ ఆధారంగా రూపొందుతున్న మహానటి వంటి తదితర చిత్రాల్లో నటిస్తున్నది. సమంతా తరువాత టాలీవుడ్‌లో రకుల్‌దే హవా. కెరీర్ తొలినాళ్లల్లో కేవలం ఆరు లక్షలే పారితోషికం తీసుకున్న ఈ ఢిల్లీ సోయగం ప్రస్తుతం ఒక్కో సినిమాకు కోటిన్నర నుంచి దాదాపు కోటి డెబ్బైఐదు లక్షలు తీసుకుంటున్నట్లు తెలిసింది. నాన్నకు ప్రేమతో సినిమాతో టాప్‌లీగ్‌లోకి ప్రవేశించిన రకుల్ ఈ సినిమా నుంచే ఎక్కువ మొత్తాన్ని డిమాండ్ చేయడం మొదలుపెట్టింది. ఇటీవల విడుదలైన ధ ృవ కోసం దాదాపు రెండు కోట్లు తీసుకుందనే వార్తలు వినిపించాయి. ప్రస్తుతం జయ జానకి నాయక, స్పైడర్ చిత్రాలతో పాటు హిందీలో ఐయారీలో నటిస్తోంది.

**మహానటితో వెలుగులోకి....**

నేను శైలజ, నేను లోకల్ వంటి వరుస విజయాలతో తెలుగు ప్రేక్షకుల ద ృష్టిని ఆకర్షించిన చెన్నై చిన్నది కీర్తిసురేష్. ప్రస్తుతం తెలుగు, తమిళ భాషల్లో మూడు క్రేజీ ప్రాజెక్టుల్లో నటిస్తూ బిజీగావుంది. పవన్‌కల్యాణ్‌తో త్రివిక్రమ్ రూపొందిస్తున్న సినిమాతో పాటు సావిత్రి జీవిత చరిత్ర ఆధారంగా రూపొందుతున్న మహానటి, సూర్య హీరోగా నటిస్తున్న తానా సేర్న్‌ద కూట్టం చిత్రాల్లో నటిస్తోంది. నేను శైలజ చిత్రానికి గానూ కోటి లోపే పారితోషికాన్ని తీసుకున్న కీర్తి మహానటి కోసం రెండు భాషలకు కలిపి దాదాపు మూడు కోట్లు తీసుకున్నట్లు తెలిసింది. కాగా ఒక్కో సినిమాకు కీర్తిసురేష్ కోటిన్నర నుంచి రెండు కోట్లు డిమాండ్ చేస్తున్నట్లు తమిళ చిత్ర వర్గాల సమాచారం. ఎన్టీఆర్ నటించిన జనతాగ్యారేజ్ సినిమాలోని ప్రత్యేక గీతం కోసం 75లక్షల పారితోషికం తీసుకుని అందరిని ఆశ్చర్యపరిచింది కాజల్‌అగర్వాల్. ఆ తరువాత చిరంజీవి రీఎంట్రీ ఇచ్చిన ఖైదీనంబర్ 150 చిత్రానికి రెండు కోట్లు వసూలు చేసింది. ప్రస్తుతం తెలుగులో నేనే రాజు నేనే మంత్రి, కల్యాణ్‌రామ్ నటిస్తున్న ఎమ్ఎల్ఏ చిత్రాలతో పాటు తమిళంలో అజిత్ హీరోగా నటిస్తున్న వివేగం, విజయ్ చేస్తున్న మెర్సల్ చిత్రాలకు కాజల్ కోటిన్నర నుంచి రెండు కోట్లు రెమ్యునరేషన్ తీసుకున్నట్లు సమాచారం.

**కోటిన్నర జాబితాలో....**

ఈ జాబితాలో శ ృతిహాసన్, త్రిష, తమన్నా, పూజా హెగ్డే వున్నారు. ఈ నలుగురిలో శ ృతిహాసన్, త్రిషలకు తెలుగులో ఒక్క సినిమా కూడా లెకపోవడం గమనార్హం. తమిళంలో ఏకంగా ఆరు చిత్రాల్లో నటిస్తూ బిజీగా వున్న త్రిష ఒక్కో సినిమాకు కోటిన్నర నుంచి రెండు కోట్లు వసూలు చేస్తున్నది. ఆమె నటిస్తున్న చిత్రాల్లో కొన్ని త్వరలో తెలుగులోనూ విడుదల కానున్నాయి. బాహుబలి సినిమాతో దేశవ్యాప్తంగా గుర్తింపును తెచ్చుకున్న తమన్నా ఒక్కో సినిమాకు కోటి నుంచి కోటిన్నర తీసుకుంటున్నది. అయితే ప్రస్తుతం ఆమెకు తెలుగులో చెప్పుకోదగ్గ అవకాశాలు లేవు. సందీప్‌కిషన్ హీరోగా ఫనా ఫేమ్ కునాల్ కోహ్లీ రూపొందిస్తున్న ద్విభాషా సినిమా తప్ప తెలుగులో తమన్నాకు చెప్పుకోదగ్గ సినిమా లేకపోవడం గమనార్హం. 60 లక్షల నుంచి కోటి తీసుకుంటున్న వారి జాబితాలో రాశీఖన్నా, లావణ్యత్రిపాఠి, హెబ్బా పటేల్, శ్రియ, రెజీనా, తాప్సీ, అంజలి వంటి తారలు వున్నారు. ఒకప్పుడు కోటితో సరిపెట్టుకునే కథానాయకలు



సూపర్‌స్టార్‌గా నిలిచిందామె. ఇటీవల ఆమె నటించిన పలు చిత్రాలు విజయవంతమై నిర్మాతలకు లాభాల్ని అందించడంతో చాలా మంది నిర్మాతలు నయన అడిగిన పారితోషికాన్ని ఇవ్వడానికి వెనుకాడటం లేదు. బాక్సాఫీస్ క్వీన్‌గా పేరుతెచ్చుకుంటున్న ఆమె దక్షిణాదిలోనే అత్యధిక పారితోషికాన్ని డిమాండ్ చేస్తున్న నాయికగా నిలవడం విశేషం. ప్రస్తుతం బాలక ృష? కథానాయకుడిగా తమిళ దర్శకుడు కె.ఎస్.రవికుమార్ ఓ చిత్రాన్ని తెరకెక్కించడానికి సన్నాహాలు చేస్తున్న విషయం తెలిసిందే. సి.కల్యాణ్ నిర్మించనున్న ఈ చిత్రంలో నయనతారను కథానాయికగా ఎంపిక చేశారు. ఈ సినిమా కోసం ఆమె నాలుగు కోట్లు తీసుకుంటున్నట్లు తెలిసింది.

**శాసిస్తున్న దేవసేన....**

లేడీ సూపర్‌స్టార్‌గా పేరుతెచ్చుకున్న విజయశాంతి తరువాత మహిళా ప్రధాన చిత్రాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది బెంగళూరు సోయగం అనుష్క. కమర్షియల్ చిత్రాల్లో నటిస్తూనే మరో పక్క అరుంధతి వంటి మహిళా ప్రధాన చిత్రాలకు ప్రాధాన్యతనిస్తున్నది. స్టార్ హీరోలకు సమానమైన గుర్తింపుతో పాటు మార్కెట్‌నూ సొంతం చేసుకున్న అనుష్క ప్రస్తుతం దక్షిణాదిలో హాట్ ఫేవరేట్

ప్రస్తుతం బడ్జెటే కాకుండా సినిమా మార్కెట్ పరిధి కూడా పెరగడంతో భారీగా డిమాండ్ చేయడం కొత్త ట్రెండుగా మారింది.

చిత్రసీమలో పారితోషికాల ప్రస్తావన అంతా అగ్ర హీరోల చుట్టే తిరుగుతుందనేది నిర్వివాదాంశం. ఫలానా చిత్రానికి సదరు హీరో భారీ మొత్తంలో అందుకున్నాడట..ఇదొక కొత్త రికార్డు అనే మాటలు పరిశ్రమలో తరచూ వినిపిస్తుంటాయి. అయితే ఇప్పుడు హీరోలతో పోల్చితే మేమెందులోనూ తీసిపోం అంటూ కథానాయికలు సవాళ్లు విసురుతున్నారు. కొందరు టాప్ హీరోయిన్స్ కళ్లుచెదిరే పారితోషికాల్ని స్వీకరిస్తున్నారు. మహిళా ప్రధాన చిత్రాలు, కథానాయిక నేపథ్య చిత్రాల రూపకల్పన ఎక్కువ కావడంతో ప్రస్తుతం మన నాయికలు తిరుగులేని స్టార్‌డమ్‌ను ఎంజాయ్ చేస్తున్నారు. తమకున్న డిమాండ్‌కు అనుగుణంగా భారీ మొత్తంలో పారితోషికాల్ని కోరుతున్నారు. ఉయ్యాలవాడ నర్సింహారెడ్డి చిత్రంలో చిరంజీవి సరసన నటించడానికి ఐశ్వర్యరాయ్ తొమ్మిది కోట్లు డిమాండ్ చేసిందంటే పారితోషికం విషయంలో మన తారామణులు ఎంత బెట్టుమీద వున్నారో అర్థం చేసుకోవచ్చు....

---

# నాని 'నిన్ను కోరి' 500 ప్రీమియర్స్




హీరో నాని సినిమాలకు తెలుగు రాష్ట్రాల్లోనే కాదు, ఓవర్సీస్ మార్కెట్లోనూ మంచి డిమాండ్ ఏర్పడింది. తెలుగులో పెద్ద పెద్ద మాస్ హీరోలు సైతం అందుకోలేని ఎన్నో ఓవర్సీస్ రికార్డులను నాని అవలీలగా అందుకున్నారు. ఈ మధ్య కాలంలో విడుదలైన నాని సినిమాల ఓవర్సీస్ కలెక్షన్లు కూడా బావున్నాయి. జులై7న నాని 'నిన్న కోరి' సినిమా ద్వారా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు.

ఇప్పటికే విడుదలైన ట్రైలర్ ఎవరూ ఊహించని రెస్పాన్స్ సొంతం చేసుకుంది. ఏకంగా 10 మిలియన్ వ్యూస్ సాధించింది. సినిమాకు డిమాండ్ ఎక్కువగా ఉండటంతో రిలీజ్ కూడా అదే స్థాయిలో ప్లాన్ చేస్తున్నారు. ముఖ్యంగా ఓవర్సీస్ మార్కెట్లో రికార్డు స్థాయిలో ఈ చిత్రం విడుదలవుతోంది.

పెద్ద పెద్ద స్టార్ హీరోల సినిమాలే ఓవర్సీస్‌లో 500 ప్రీమియర్ షోలు పడటం అంటే చాలా కష్టం. కానీ నాని నటించిన 'నిన్ను కోరి' మూవీ ఓవర్సీస్ లో 500 లొకేషన్లలో ప్రిమియర్స్ వేస్తున్నారు.


కేవలం యూఎస్ఏలోనే 350 పైగా లొకేషన్లలో ప్రీమియర్స్ వేస్తున్నారు. సినిమా విడుదల ఒక రోజు ముందే(జులై 6)... సాయంత్రం 6 గంటలు యూఎస్ఏలో షోలు మొదలు కాబోతున్నాయి. రెడ్ హార్ట్ మూవీస్ సంస్థ ఓవర్సీస్ లో ఈ చిత్రాన్ని డిస్ట్రిబ్యూట్ చేస్తోంది. ఆగండ్రా బాబూ... మాట్లాడలేక పోతున్నా అంటూ 'నిన్నుకోరి' సినిమా గురించి నాని అదిరిపోయే స్పీచ్ ఇచ్చారు.

# నాకు లవర్ ఉన్నాడు..

అందాల తార శ ృతిహాసన్ ప్రతిభ గురించి కాకుండా ఆమె వ్యక్తిగత జీవితం గురించే మీడియాలో రచ్చ జరుగుతుంటుంది. ఫలానా హీరోతో చనువుగా ఉంటుంది. ముంబైలో ఓ హీరోతో డేటింగ్ చేస్తుంటుంది అనే గాసిప్స్ మీడియాలో వైరల్ కావడం గమనిస్తూనే ఉంటాం. తాజాగా లండన్‌కు చెందిన థియేటర్ నటుడు మైఖేల్ కోర్సేల్‌తో రిలేషన్ కొనసాగిస్తున్నదనే వార్తలు మీడియాలో గుప్పుమంటున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తన వ్యక్తిగత జీవితం గురించి వస్తున్న వార్తలపై శ ృతి మండిపడ్డారు. త కొన్ని నెలలుగా మైఖేల్ కోర్సేల్‌తో డేటింగ్ చేస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. కాటమరాయుడు షూటింగ్ సందఠరేగా మైఖేల్, శ ృతి ఇద్దరూ వెకేషన్ కోసం మస్సోరికి వెళ్లడం చర్చనీయాంశమైంది. వారిద్దరూ ముంబై ఎయిర్‌పోర్ట్‌లో మీడియా కంటపడిన సంగతి కూడా తెలిసిందే. ఇలాంటి వార్తల నేపథ్యంలో మైఖేల్‌తో ఉన్న రిలేషన్‌పై శ ృతిహాసన్ క్లారిటీ ఇచ్చింది. నా వ్యక్తిగత జీవితం గురించి నేను ఎక్కువగా మాట్లాడను. మీడియాతో చర్చించడానికి అసలే ఇష్టపడను. ఎందుకంటే నా జీవితం నాకు చాలా విలువైనది. దానిని బజారుకీడ్చి ఇబ్బంది పడలేను అని శ ృతి పేర్కొన్నది.



# 'బిగ్‌బాస్' డేట్ ఫిక్స్



యంగ్ టైగర్ ఎన్టీఆర్ హోస్ట్ చేయబోతున్న బుల్లితెర రియాల్టీ షో 'బిగ్ బాస్' ప్రారంభ తేదీ, షెడ్యూల్ ఖరారైంది. జులై 16 నుండి స్టార్ మాటీవీలో ఈ షో ప్రసారం కాబోతోంది. సోమవారం నుండి శు క్రవారం వరకు రాత్రి 9.30 గంటలకు, శని-ఆది వారాల్లో రాత్రి 9 గంటలకు ఈ షో ప్రసారం అవుతుంది. 12 మంది సెలబ్రిటీలు పాల్గొనే ఈ రియాల్టీ షో ప్రత్యేకంగా నిర్మించిన బిగ్ బాస్ హౌస్ లో జరుగుతుంది. అందరినీ అందులోకి పంపి లాక్ చేస్తారు. 70 రోజుల పాటు వారు అందులో బయటి ప్రపంచంతో సంబంధం లేకుండా ఉండాల్సి ఉంటుంది. వారి కదలికలను 70 కెమెరాలతో పర్యవేక్షిస్తుంటారు. దాదాపు 100 మంది ప్రముఖుల వడపోత అనంతరం 12 మందిని ఫైనల్ పోటీ దారులుగా ఎంపిక చేశారు. బిగ్ బాస్ తెలుగు వీక్షకులకు ఈ పన్నెండుమంది కావాల్సినంత వినోదం పంచుతారని షో నిర్వాహకులు అంటున్నారు. ఇప్పటికే విడుదలైన బిగ్ బాస్ తెలుగు ప్రోమోలకు మంచి స్పందన వచ్చింది. 55 మిలియన్(5.5కోట్లు) వ్యూస్ సొంతం చేసుకుంది. నేషనల్ వైడ్ సోషల్ మీడియా ప్లాప్‌ఫాంలో ఈ వీడియోలు ట్రెడింగ్ అయ్యాయి. షో ప్రారంభం అయ్యాక కూడా రెస్పాన్స్ అదే స్థాయిలో ఉంటుందని అంచనా వేస్తున్నారు.

# కొత్త సీఈసీగా అచల్‌కుమార్ జ్యోతి



దిల్లీ: కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన అధికారిగా అచల్ కుమార్ జ్యోతి నియమితులయ్యారు. ప్రస్తుతం ఉన్న ప్రధానాధికారి నసీమ్ జైదీ ఈ నెల 6న పదవీ విరమణ పొందనుండటంతో ఆ స్థానంలో అచల్‌కుమార్‌ను నియమించినట్లు న్యాయశాఖ వెల్లడించింది. అదే రోజున అచల్ బాధ్యతలు చేపట్టనున్నారు.

సాధారణంగా ఎన్నికల అధికారి, ప్రధాన ఎన్నికల అధికారి పదవీకాలం 6 సంవత్సరాలు. అయితే అంతకంటే ముందుగానే సదరు అధికారికి 65ఏళ్ల వయసు వస్తే.. పదవి నుంచి వె%దొలుగుతారు. ప్రస్తుత ప్రధానాధికారి జైదీకి ఈ నెల 6న 65వ పడిలోకి అడుగుపెట్టనున్నారు. దీంతో ఆయన పదవి విరమణ పొందడంతో.. ఆ స్థానంలో అచల్ కుమార్ బాధ్యతలు స్వీకరించనున్నారు. 64ఏళ్ల అచల్ ఎన్నికల ప్రధాన అధికారిగా ఏడాదిపాటు కొనసాగనున్నారు.

1975లో గుజరాత్ కేడర్ నుంచి ఐఏఎస్ అధికారిగా ఎంపికైన అచల్ కుమార్ జ్యోతి.. అనేక కీలక పదవుల్లో పనిచేశారు. కండ్లా పోర్ట్ ట్రస్ట్‌కు ఛైర్మన్‌గా, సర్దార్ సరోవర్ నర్మద నిగమ్ లిమిటెడ్‌కు మేనేజింగ్ డైరెక్టర్‌గా వ్యవహరించారు. గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగానూ ఆయన పనిచేశారు. 2015 మే నెలలో ఎన్నికల కమిషనర్‌గా నియమితులై పనిచేశారు.

# కోహ్లీ సేనకు కొత్త మేనేజర్!



దిల్లీ: భారత క్రికెట్ జట్టుకు కొత్త పరిపాలన మేనేజర్‌ను ఎంపిక చేయాలని బీసీసీఐ యోచిస్తోంది. ఇందు కోసం ప్రత్యేక ప్రణాళిక కూడా సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో టీమిండియా మేనేజర్‌ని మార్చాల్సిన అవసరం ఏమిటి... ఒక్కసారిగా ఈ అంశం ఎందుకు తెరపైకి వచ్చిందనేది ప్రతి ఒక్క అభిమాని మదిలో మెలిగే ప్రశ్న. ఛాంపియన్స్ ట్రోఫీ అనంతరం ప్రస్తుత జట్టు పరిపాలన మేనేజర్ కపిల్ మల్హోత్ర సమర్పించిన నివేదికే ఇందుకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది. అతను సమర్పించిన నివేదికే అతని జాబ్‌కి ఎసరు తెచ్చిపెట్టింది.

సాధారణంగా స్వదేశంలో కానీ, విదేశంలో కానీ భారత జట్టు ఏ టోర్నీ ఆడినా.. సదరు టోర్నీ ముగిసిన అనంతరం జట్టు మేనేజర్ బోర్డు(బీసీసీఐ)కి రిపోర్టు అందించాలి. తాజాగా ఛాంపియన్స్ ట్రోఫీ అనంతరం భారత జట్టు పరిపాలన మేనేజర్ కపిల్ మల్హోత్రా అందించిన నివేదికపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఎందుకంటే ఫైనల్లో భారత్ తన చిరకాల ప్రత్యర్థి పాక్ చేతిలో ఓడిపోవడం, టోర్నీ అనంతరం కోచ్ పదవికి అనిల్‌కుంబ్లే రాజీనామా చేయడం. ఈ రెండు అంశాల గురించి కపిల్... నివేదికలో ఏమని పేర్కొంటాడో అని సర్వత్రా ఆసక్తి నెలకొంది. కానీ, అతను మాత్రం కోహ్లీ-కుంబ్లే సంబంధాలపై తీవ్రమైన అభిప్రాయాలేమీ వ్యక్తం చేయలేదు. కోహ్లీకి ప్రతికూలమైన అంశాలేమీ పొందుపరచలేదు. ఛాంపియన్స్ ట్రోఫీ జరిగిన సమయంలో కోహ్లీ-కుంబ్లే పెద్దగా మాట్లాడుకోలేదని, ఇరువురి మధ్య ఎలాంటి గొడవ చోటు చేసుకోవడం తాను చూడలేదు అని మాత్రమే పేర్కొన్నాడు. కపిల్ నివేదికను చూసి ఆశ్చర్యపోయిన బీసీసీఐ భారత జట్టుకి ప్రొఫెషనల్ మేనేజర్‌ను ఎంపిక చేయాలన్న ఆలోచనలో పడింది. దీనిపై అంతర్గతంగా భారీ చర్చలే జరుగుతున్నాయి. వారం లేదా రెండు వారాల్లో దీనిపై బీసీసీఐ స్వచ్ఛందంగా ప్రకటన చేయనుంది.

# ఇంగ్లాండ్ పర్యటనకు ద్రవిడ్ దూరం



దిల్లీ: ఇండియా-ఎ, అండర్-19 క్రికెట్ జట్లకు భారత మాజీ ఆటగాడు రాహుల్ ద్రవిడ్ కోచ్‌గా తిరిగి ఎంపికైన విషయం తెలిసిందే. ఇటీవల బీసీసీఐతో తాజాగా రెండేళ్ల ఒప్పందాన్ని కుదుర్చుకున్న ద్రవిడ్ త్వరలో ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లే అండర్-19 భారత జట్టుకి దూరం కానున్నాడు. జులై 5 నుంచి ఈ పర్యటన ప్రారంభం కానుంది. కోచ్‌గా బాధ్యతలు తీసు కున్న ద్రవిడ్ ఇంగ్లాండ్ పర్యటనకు ఎందుకు వెళ్లడంలేదని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీంతో బీసీసీఐ ప్రతినిధి ఒకరు వివరణ ఇచ్చారు.

జులైలో ఇండియా-ఎ జట్టు ముక్కోణపు వన్డే సిరీస్ కోసం దక్షిణాఫ్రికాలో పర్యటించనుంది. ఆస్ట్రేలియా-ఎ, దక్షిణాఫ్రికా-ఎ, ఇండియా-ఎతో ఈ సిరీస్ జరగనుంది. ఈ సిరీస్ కోసం ద్రవిడ్ భారత్-ఎతో కలిసి దక్షిణాఫ్రికా పర్యటనకు వెళ్లనున్నాడు. వన్డే సిరీస్ అనంతరం అనధికార టెస్టు మ్యాచ్‌లను భారత్ ఆడనుంది.

ఈ కారణం వల్లే ద్రవిడ్ అండర్-19 జట్టుతో ఇంగ్లాండ్ వెళ్లలేకపోతున్నాడని బీసీసీఐ ప్రతినిధి ఒకరు తెలిపారు.

బీసీసీఐతో తాజా ఒప్పందం కోసం ద్రవిడ్ ఐపీఎల్‌కి గుడ్‌బై చెప్పిన సంగతి తెలిసిందే. ఐపీఎల్-10లో ద్రవిడ్ దిల్లీ డేర్‌డెవిల్స్ జట్టుకి కోచ్‌గా బాధ్యతలు నిర్వహించాడు. అండర్-19, భారత్-ఎకి కోచ్‌గా ఒప్పందం కుదుర్చుకోవాలంటే మరే ఇతర బాధ్యతలు ద్రవిడ్ నిర్వహించకూడదన్నది బీసీసీఐ నియమం. ఇందుకోసం ద్రవిడ్ దిల్లీని వదులుకోగా... అందుకు తగ్గ పారితోషకాన్ని బీసీసీఐ ద్రవిడ్‌కి అందజేస్తోంది.

రెండు సంవత్సరాల ఒప్పందానికి ద్రవిడ్‌కి బీసీసీఐ సుమారు రూ.10కోట్లు అందజేయనుంది.


# కార్తి చిదంబరం కేసులో ఈడీకి సుప్రీంకోర్టు షాక్

న్యూఢిల్లీ : కేంద్ర మాజీ మంత్రి పి. చిదంబరం కుమారుడు కార్తి చిదంబరం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కి సుప్రీంకోర్టులో నిరాశ ఎదురైంది. ఆయనపై మనీలాండరింగ్ నిరోధక చట్టం క్రింద ఈడీ దాఖలు చేసిన కేసులో ముందస్తు విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు తిరస్కరించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జగదీశ్ సింగ్ ఖేహర్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ నిర్ణయాన్ని ప్రకటించింది.

కార్తి చిదంబరం వాదనను వినేందుకు మద్రాస్ హైకోర్టుకు అధికార పరిధి ఉందా? అని ఈడీ సుప్రీంకోర్టును అడిగింది. ఈడీ సమన్లను కార్తి మద్రాస్ హైకోర్టులో సవాలు చేశారు. గత నెలలో చెన్నై లోని కార్తి నివాసంపై ఆదాయపు పన్ను శాఖ దాడుల నేపథ్యంలో కార్తి, తదితరులపై ఈడీ మనీలాండరింగ్ నిరోధక చట్టం ప్రకారం కేసు నమోదు చేసింది.

సీబీఐ ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈ కేసు దాఖలు చేసింది. పి. చిదంబరం ఆర్థిక మంత్రిగా ఉన్న సమయంలో మారిషస్ నుంచి నిధులను స్వీకరించినందుకు కార్తి చిదంబరంపై సీబీఐ కేసు నమోదు చేసింది.

# కోచ్ రేసులో రవిశాస్త్రినే ముందున్నాడు



దిల్లీ: భారత జట్టు ప్రధాన కోచ్ పదవి రేసులో రవిశాస్త్రి ముందున్నాడని భారత జట్టు మాజీ సారథి సునీల్ గవాస్కర్ తెలిపారు. ఓ అంతర్జాతీయ ఛానెల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో గవాస్కర్ మాట్లాడుతూ.. భారత జట్టు ప్రధాన కోచ్ పదవికి దరఖాస్తు చేసిన వారందరిలో రవిశాస్త్రి ముందున్నాడని చెప్పారు. టీమ్ ఇండియా కోచ్ పదవికి రవిశాస్త్రి దరఖాస్తు చేసినట్లు ఓ బీసీసీఐ అధికారి తాజాగా ధ్రువీకరించిన విషయం తెలిసిందే.

గంగూలీ, సచిన్, లక్ష్మణ్‌తో కూడిన క్రికెట్ సలహా మండలి(సీఏసీ) జులై 10న ముంబయిలో ఇంటర్వ్యూలు నిర్వహించనుంది. ఎవరిని ఎంచుకుంటే జట్టంతా సౌకర్యవంతంగా ఫీలవుతుందో... అతనికే సీఏసీ కోచ్ పదవిని కట్టబెడతోందని గవాస్కర్ తెలిపారు. 2014 ఆగస్టు నుంచి 2016 జూన్ వరకు శాస్త్రి టీమిండియా డైరెక్టర్‌గా పనిచేశారు. ఆ సమయంలోనే భారత్ 22 ఏళ్ల తర్వాత శ్రీలంకపై టెస్టు సిరీస్ గెలిచింది. అనంతరం దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్టు సిరీస్‌ను భారత్ చేజిక్కించుకుందని గవాస్కర్ తెలిపారు. సెహ్వాగ్, టామ్ మూడీ దరఖాస్తు చేసినప్పటికీ వారిద్దరి కంటే రవిశాస్త్రికే అనుభవం ఎక్కువ ఉందని, గతంలోనూ జట్టుతో కలిసి ఉన్నాడని అన్నారు.

అనంతరం వెస్టిండీస్ పర్యటనలో ఉన్న టీమిండియా గురించి గవాస్కర్ మాట్లాడుతూ.. భారత్-వెస్టిండీస్ మధ్య నాలుగో వన్డేలో ధోనీ నెమ్మదిగా సాధించిన అర్ధశతకం వల్లే భారత్ ఓడిపోయిందనేదే ముఖ్య కారణం కాదు అని, పలు కారణాల్లో అది ఒకటి మాత్రమే అని, ధోనీపై అనవసర వ్యాఖ్యలు చేయవద్దని, జట్టంతా బ్యాటింగ్‌లో వైఫల్యం చెందడం వల్లే ఓడిపోయిందని గవాస్కర్ చెప్పారు.

# కొండవీటి వాగు ఎత్తిపోతల పథకం ఎంతో అవసరం

## ఎపెక్స్ కమిటీ సభ్యుడు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు




విజయవాడ : ప్రకాశం ఆనకట్ట ఎగువన ఉండవల్లి వద్ద ప్రభుతం నిర్మించిన కొండవీటి వాగు ఎత్తిపోతల పథకం అటు కృష్ణా రైతులకు, రాజధాని అమరావతి నిర్మాణానికి ఎంతో అవసరమని జలవనరుల శాఖ ఎపెక్స్ కమిటీ సభ్యుడు ఆళ్ల వెంకట గోపాలకృష్ణ అన్నారు. ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొండవీటి వాగు గుంటూరు జిల్లాలోని పేరేచర్ల దగ్గర కొండవీడు కొండల్లో పుట్టి తాడికొండ, మంగళగిరి నియోజకవర్గాల పరధిలో ఐదు మండలాల్లో ప్రవహించి ప్రకాశం ఆనకట్ట ఎగువన కృష్ణానదిలో కలుస్తుందని, అధిక వర్షం వచ్చినప్పుడు తాడికొండ నుంచి ఉండవల్లి వరకు 10గ్రామాల పరధిలో 13500 పంటభూములు గతంలో ముంపునకు గురయ్యేవన్నారు. ఈ ముంపును నివారంచేందుకు కొండవీటి వాగు వరదనీటిని ప్రకాశం ఆనకట్ట ఎగువకు 5వేల క్యూసెక్కులు ఎత్తివేసి ఆ నీటిని కృష్ణా డెల్టా ఆయకట్టుకు ఉపయోగపడేలా ప్రభుత్వం నిర్ణయించి రూ.237కోట్లు కేటాయించిందని వివరించారు. కృష్ణా తూర్పు డెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ గుత్తా శివరామకృష్ణ, గుంటూరు ఎస్ఎస్ఆర్‌సి ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ భుజంగరావు మాట్లాడుతూ ఈ పథకం వల్ల సుమారు 2 టీఎంసీల వరద నీటిని కృష్ణానదిలోకి ఎత్తిపోసి ఆనీటిని అవసరాన్ని బట్టి కృష్ణా డెల్టా ఆయకట్టుకు వినియోగిస్తారని, దీని వల్ల అమరావతి రాజధాని నగరంలో సుమారు 10,600 ఎకరాల నివాసయోగ్యమైన భూమిని ముంపుబారి నుంచి రక్షించేందుకు వీలుకలుగుందన్నారు. ఎస్ఎస్ఎల్‌సీ ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ వై.పుల్లయ్య చౌదరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నియమించిన నిపుణుల కమిటీ సూచనల మేరకు పూర్తి పారదర్శకతో సాంకేతికపరమైన అంశాలను పూర్తిగా అధ్యాయనం చేసిన తరువాతే నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ నాదెళ్ల చెన్నకేశవరావు, దొండపాటి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

# జమ్ముకశ్మీర్ అసెంబ్లీలో ఆందోళన

న్యూదిల్లీ: వస్తు, సేవల పన్ను(జీఎస్‌టీ) బిల్లుపై చర్చ సందర్భంగా జమ్ముకశ్మీర్ అసెంబ్లీలో విపక్షాలు ఆందోళనకు దిగాయి. జీఎస్‌టీ బిల్లును వ్యతిరేకిస్తూ నేషనల్ కాన్ఫరెన్స్, కాంగ్రెస్ సభ్యులు నిరసన తెలిపారు. ఈ బిల్లు వల్ల జమ్ముకశ్మీర్ ఆర్థిక స్వాతంత్ర్యం కోల్పోతుందని ఆందోళన వ్యక్తంచేశారు. ఆందోళన కారణంగా సభా కార్యక్రమాలు మధ్యాహ్నానికి వాయిదా పడ్డాయి. స్వతంత్ర ఎమ్మెల్యే రషీద్‌ను మార్షల్స్ అసెంబ్లీ బయటకు తరలించారు.

దేశవ్యాప్తంగా జీఎస్‌టీ అమల్లోకి రాగా.. జమ్ముకశ్మీర్ అసెంబ్లీ మాత్రం ఇంకా ఈ బిల్లుకు ఆమోదం తెలపలేదు. దీంతో జీఎస్‌టీ బిల్లుకు జులై 6లోగా ఆమోదముద్ర వేయాలని పాలక పక్షం యోచిస్తోంది. మరోవె%పు సభలో ఎన్సీపీ, కాంగ్రెస్ సభ్యులు బిల్లును వ్యతిరేకిస్తుండగా.. బయట పలు వర్తక సంఘాలు ఒక సమన్వయ కమిటీగా ఏర్పడి ఆందోళన చేస్తున్నారు.

# వెస్టిండీస్ ఆటగాడికి యువీ బహుమతి

ఆంటిగ్వా: ప్రస్తుతం కోహ్లీ సారథ్యంలోని భారత జట్టు విండీస్‌లో పర్యటిస్తోన్న సంగతి తెలిసిందే. ఐదు వన్డేల సిరీస్‌లో భారత్ 2-1 ఆధిక్యంలో కొనసాగుతోంది. ఇరు జట్ల మధ్య చివరి వన్డే ఈ నెల 6న జమైకాలోని కింగ్‌స్టన్ మైదానంలో జరగనుంది.

విండీస్ పర్యటనలో ఉన్న భారత ఆటగాళ్లు విరామం దొరికితే చాలు.. స్థానిక ప్రదేశాలను చూడటం, బీచ్, స్విమ్మింగ్ పూల్స్‌లో సందడి చేస్తూ కనిపిస్తున్నారు. అలాగే పలువురి విండీస్ ఆటగాళ్ల ఇంటికి వెళ్లి గడుపుతున్నారు. సిరీస్‌లో భాగంగా తొలి వన్డే అనంతరం భారత ఆటగాళ్ల బ్రావో ఇంట్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక విందు కార్యక్రమంలో పాల్గొన్న సంగతి తెలిసిందే. తాజాగా విండీస్ ఆటగాడు డారెన్ బ్రావో... యువరాజ్ సింగ్‌ని కలిశాడు. ఈ సందర్భంగా యువీ ఒక బ్యాట్‌ను బ్రావోకి గిఫ్ట్‌గా అందించాడు. భారత్‌తో తలపడే విండీస్ జట్టులో డారెన్ బ్రావో లేడు.




# కార్మికుల చట్టాలను కాలరాస్తున్న ప్రభుత్వాలు

## కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ మహాధర్నా

విజయవాడ : కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న ప్రభుత్వాలను సాగనంపాలని సీఐటీయూ రాష్ట్ర నాయకురాలు పుణ్యవతి పిలుపునిచ్చారు. సమాన పనికి సమానం వేతనం ఇవ్వాలని కోరుతూ జిల్లా సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర నాయకురాలు పుణ్యవతి మాట్లాడుతూ కార్మికుల హక్కులకు భంగం కలగకుండా చట్టాలు తీసుకొస్తే.. వాటిని కాలరాస్తున్నాయని ధ్వజమెత్తారు. కార్మికులంతా రోడ్డున పడుతున్నారని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యోగాలను భర్తీ చేయడం లేదు.. ఒప్పంద ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడం లేదు.. ఉన్న వారితో వూడిగం చేయించుకోవడమే ప్రభుత్వాల నైజమని ధ్వజమెత్తారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు పూర్తిగా విస్మరించారన్నారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు కొమ్ము కాస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ పథకాలను స్వచ్ఛంద సంస్థలకు అప్పగిస్తూ నిర్వీర్యం చేస్తున్నాయన్నారు. అంగన్‌వాడీలకు, ఆశా వర్కర్లకు గత ఐదు నెలలుగా జీతాలు ఇవ్వలేదు. కుటుంబాలను ఎలా పోషిస్తారని ఆమె ప్రశ్నించారు. సమాన పనికి సమానం వేతనాలు ఇవ్వాలని అత్యున్నత న్యాయస్థానమే చెప్పినా ఎందుకు అమలు చేయడం లేదన్నారు. సరకులు, గుడ్లు సరఫరా చేయకుండా అన్న అమృతం హస్తం పథకం ప్రారంభించడం సిగ్గుచేటన్నారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు ఓబులు మాట్లాడుతూ గత మూడేళ్లుగా ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు ధర్నాలు, ఆందోళనలు, నిరసనలు చేపట్టినా ఫలితం లేదన్నారు. కార్మికులందరికీ కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని ఆయన డిమాండు చేశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని స్వచ్ఛంద సంస్థలకు ఇవ్వాలన్న నిర్ణయాన్ని విరమించుకోవాలన్నారు.

పెద్ద సంఖ్యలో కార్మికులు తరలిరావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు.

చివరికి జేసీ రమామణి ధర్నా వద్దకు చేరుకున్నారు. తమ పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని, పరిధిలో లేనివి ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని జేసీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహారావు, జిల్లా అధ్యక్షుడు నాగరాజు, ప్రధాన కార్యదర్శి వెంకటేష్, నాయకురాళ్లు వనజా, ఉష, నాగమణి, నాగవేణి తదితరులు పాల్గొన్నారు.

VIJAYABHANU - Vijayawada
Editor : Bete Sai Trilok, Printed and Published by Bete Chandra Sekhar on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published from D.No:58-3-15/1A, Atchamma Street, Patamata, Vijayawada-520 010, A.P. and Printed at **VIJAYABHANU PRESS,** D.No.9-3-17, Pithapuram Colony, Visakhapatnam -530 003, RNI No.APTEL/2008/24468, ☆ e-mail: vijayabhanudaily@gmail.com